

అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి

1

ఆదివారం 05 ఫిబ్రవరి 2023

గ్రామపంచాయతీ కార్మికుడు మృతి

నవతెలంగాణ-మర్రిగూడ

మర్రిగూడ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు ఎడ్ల రమేష్(32) శనివారం ఉదయం అనారోగ్యం కారణంగా మరణించారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య వారి స్వగ్రామానికి వెళ్లి రమేష్ పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. గత మూడు సంవత్సరాలుగా వట్టిపల్లి గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ విధానం కింద రమేష్ పని చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వట్టిపల్లి హనుమంతు, ఊరి పక్క లింగయ్య, పెరుమాండ్ల మంజుల, తిప్పర్తి లింగయ్య, ఎడ్ల నరసింహ, ఊరి పక్క వెంకటయ్య, కురంపల్లి లక్ష్మమ్మ, ఊరి పక్క నరసింహ, ఎడ్ల జంగయ్య, పోలే ముత్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజామార్గం...

నవతెలంగాణ-నాగార్జునసాగర్

రాజీ మార్గమే రాజమార్గమని విజయపురి టౌన్ ఎస్సై బీ.రాంబాబు అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజీ మార్గం ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ మంచి వేదికని, కక్షిదారులకు డబ్బు, సమయం కూడా ఆదా అవుతుందన్నారు. ఫిబ్రవరి 4 నుండి11వ తేదీ వరకు నిడమనూరు కోర్టులో నిర్వహించే మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు సత్వర పరిష్కారం అవుతాయనే విషయాన్ని ప్రజలకు తెలియజేసేందుకు న్యాయవాదులు,లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు మరింత కృషి చేస్తున్నట్లు తెలిపారు.



ఎయిమ్స్‌కు మొండిచెయ్యి చూపిన కేంద్ర ప్రభుత్వం

- **సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు**

నవతెలంగాణ - భువనగిరి

కేంద్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో బీబీనగర్ ఎయిమ్స్ కు మొండిచెయ్యి చూపిందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. శనివారం స్థానిక ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాలులో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనూరి నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో బీబీనగర్‌లో ఉన్న ఎయిమ్స్‌కు కేంద్రంలో ఉన్న బీజేపీప్రభుత్వం బడ్జెట్లో మొండి చెయ్యి చూపిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది జిల్లాలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించే ఎయిమ్స్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం దారుణమైన విషయమన్నారు. ఢిల్లీలో ఉన్న ఎయిమ్స్‌కు నిధులు కేటాయించి తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి భువనగిరిలో ఉన్న ఎయిమ్స్‌కు నిధులు కేటాయించకపోవడంపై బీజేపీ ప్రభుత్వానికి యాదాద్రిభువనగిరి నియోజకవర్గం మీద ఎంత చిత్తశుద్ధి ఉన్నదో అర్థమవుతుందన్నారు. ప్రజల ఆరోగ్యాల పట్ల కేంద్ర ప్రభుత్వం వైఖరి బట్టబయలు అయిందన్నారు. ఎనిమిది జిల్లాల నుండి అనేకమంది పేద, మధ్యతరగతి ప్రజలు జిల్లా కేంద్రాలలో మెరుగైన వైద్యం లేక మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు లాంటి మహానగరాలకు వెళ్లి వైద్యం చేపించుకునే పరిస్థితి దాపురించిందన్నారు.ఎయిమ్స్‌కు నిధులు కేటాయించి ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్యం తీసుకువస్తే ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని వారు అన్నారు. అదేవిధంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న బస్వాపూర్ భూనిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం నూతన అవార్డు ప్రకారం నష్టపరిహారం చెల్లించి వారిని ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్లో ప్రధానంగా ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని కాలువలకు సమృద్ధిగా నిధులు కేటాయించి పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మొండి చెయ్యి చూపి కపట ప్రేమను ప్రదర్శించిందన్నారు. జిల్లా అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా అభివృద్ధిని విస్మరించిందని వారు అన్నారు. రానున్న కాలంలో జిల్లాలో ఉన్న అనేక ప్రజా సమస్యలపై ఆందోళన పోరాటాలు దాఫలవారీగా నిర్వహించి పోరాటాలు ఉధృతం చేస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మంగ నర్సింహులు, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, దాసరి పాండు, మేక అశోక్ రెడ్డి జిల్లా కమిటీ సభ్యులు సిర్పంగి స్వామి, మాయ కృష్ణ, బొల్లు యాదగిరి, మద్దెల రాజయ్య, ఎండి పాషా, పగిళ్ళ లింగారెడ్డి, జెల్లల పెంటయ్య, బూర్గు కృష్ణారెడ్డి, బబ్బూరి పోశెట్టి, బొడ్డుపల్లి వెంకటేష్,దొడ యాదిరెడ్డి, గుంటోజు శ్రీనివాసచారి, గుండు వెంకటనర్సు, గంగాదేవి సైదులు, బండారు నర్సింహ, బోలగాని జయరాములు, అవ్వారు రామేశ్వరి, గడ్డం వెంకటేష్, ఎంఏ ఇక్బాల్ మరియు వనం ఉపేందర్, మండల కార్యదర్శులు ర్యాకల శ్రీశైలం, పోతరాజు జహంగీర్, కూరేళ్ల బిక్షం, బండారు శ్రీరాములు, కూరపాటి రాములు, ప్రజా సంఘాల నాయకులు, ఈర్లపల్లి ముత్యాలు, గంటేపాక శివ, వనం రాజు, బుర్రు అనిల్, బోడ భాగ్య, మామిడి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు డాక్టర్ నిర్మలకుమారి

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని కెఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ సహాయ ఆచార్యులు డా నందిగామ నిర్మల కుమారికి రాజమండ్రిలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో పరిశోధన పత్రాన్ని అందించినట్టు శనివారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు భారతీయ భాషా కేంద్రం మైసూరు సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడురోజుల జాతీయ సదస్సు నిర్వహించారని, ఈ సదస్సులో 'మధ్యయుగంలో వీరశైవం సామాజిక సంస్కృతిక దృక్పథం' అనే రీసెర్చ్ పేపర్ ప్రజెంట్ చేశారు. ఈ పరిశోధనా పత్రంలో మధ్యయుగ సాంస్కృతిక సారస్వత రాయబారులుగా బసవడు, మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాధుడు ఆ నాటి సాహిత్య సోపాన యుగ కర్తలు గా తాము కొనసాగించిన ఆ కాలం లో వచ్చిన వైవిధ్య భరితమైన సాహిత్య సంపదను చర్చించారని తెలిపారు. నాటి ద్విపద కావ్యాలు, శీస పద్యాలు, రగడలు లాంటి అనేక ప్రయోగాత్మక రచనలు అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.కనుక మధ్యయుగంలో వీరశైవం సామాజిక సాంస్కృతిక దృక్పదం' మరింత బాగా అర్థం కావాలంటే ఆకాలపు సారస్వత సంపదను వివేచనతో అంచనా వేయాలనే అంశానిన తనపత్రంలో చర్చించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ అధ్యక్షులుగా పనిచేస్తున్న నిర్మలకుమారి ఇప్పటివరకు 30కిపైగా జాతీయ,20కిపైగా అంతర్జాతీయసదస్సులలో పత్ర సమర్పణ చేశారు.ఈ సదస్సులో ఆచార్య మాడభూషి సంపత్ సర్టిఫికెట్ అందించారన్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాగు, అధ్యాపకులు నిర్మలకుమారిని అభినందించారన్నారు.

పాత గుట్టలో ఘనంగా రథోత్సవం

నవతెలంగాణ- యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట అనుబంధం దేవాలయం పాతగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవ వేడుకను ఘనంగా నిర్వహిం చారు.అంతకుముందు ప్రతాంగ హోమం ,రతబలి లాంటి వేడుకలను ఆగమ శాస్త్ర ప్రకారం ప్రధానార్చకులు నిర్వహించారు .ఉదయం ఆలయంలో నిత్య ఆరాధనలు అనంతరం పారాయకులతో చతుర్వేద పారాయణలో నిత్య హవనాలు మూలమంత్ర ,మూర్తి మంత్ర జపాలు ,అమ్మవార్ల కల్యాణోత్సవ మూర్తులను అలంకరించి గరుడ వాహన సేవలో లక్ష్మీనరసింహుల్ని ఊరేగించారు ఈ కార్యక్రమంలో చైర్మెన్ బి.నరసింహమూర్తి ,ఇన్‌చార్జి ఈవో ఎం.రామకృష్ణారావు, ఉపకార్య నిర్వహణ అధికారి భాస్కర్, ఏఈఓ గజ్వేల్ రమేష్ బాబు, పర్యవేక్షకులు సిబ్బంది పాల్గొన్నారు.



మద్యం సేవించిన 53మందికి జరిమానా

నవతెలంగాణ -యాదగిరిగుట్ట

యాదాద్రి ట్రాఫిక్ పోలీసులకు మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డ 53 మంది కి శనివారం కోర్టు జరిమానాలను విధించినట్టు ట్రాఫిక్ సీఐ శివశంకర్ గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 ద్విచక్ర వాహనాలు ,32 కార్లు యజమానులకు 1,06000 జరిమానా కోర్టు విధించిందని తెలిపారు. మద్యం సేవించిన వ్యక్తులు వాహనాలు నడపొద్దని ఆయన సూచించారు.

పోడు భూముల పట్టాల పంపిణీకి సిద్ధం

- ఉమ్మడి జిల్లాలో 29,949 దరఖాస్తులు
- ఆమోదం పొందినవి 10 శాతం దరఖాస్తులే
- అధిక సంఖ్యలో దరఖాస్తుల తిరస్కరణ
- పూర్తయిన డిజిటల్స్ సంతకాలు
- పాస్ పుస్తకాల పంపిణీ కసరత్తు
- అధికార ప్రకటనే తరువాయి

నవతెలంగాణ- మిర్యాలగూడ



ప్రభుత్వ భూములు సాగు చేసుకుని జీవన సాగిస్తున్న పేద గిరిజనులకు పోడు భూముల కింద పాసుపుస్తకాలు ప్రభుత్వ అందించనుంది. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటు కబ్జాలో ఉన్నవారికి నిజమైన అర్హులను గుర్తించి వారికి పాసుపుస్తకాలు అందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. పోడు భూముల సాగు చేసుకుంటున్న వారికి పట్టాలిస్తామని గతంలో కేసీఆర్ ప్రకటించారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని గతంలో వామపక్షాల ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేశారు. వాపక్ష నేతలు అనేకమార్లు ప్రభుత్వ దృష్టికి మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కాలంలో మునుగోడు ఉప ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్‌తో వాపక్షాలు పొత్తు కుదరడంతో ఆ సమయంలో ప్రధానంగా పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దాని అమలులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పోడు భూములపై సర్వే నిర్వహించారు. ప్రభుత్వ భూములు కబ్జాల ఉండి సాగు చేసుకుంటున్నా పేద గిరిజనులను గుర్తించాలని ఆదేశించారు. దీనికి గాను మండల స్థాయిలో తాసిల్దార్ నేతృత్వంలో ఒక కమిటీ వేసి సర్వే చేశారు. వచ్చిన దరఖాస్తుల ను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నిజమైన గుర్తించి ఉన్నత అధికారులకు నివేదిక పంపించారు. త్వరలోనే వీరందరికీ పోడు పట్టాలు అందనున్నాయి. వెంటనే పాస్ పుస్తకాలు కూడా అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికిగాను డిజిటల్ సంతకాలు కూడా పూర్తయినట్లు జిల్లా అధికారి ఒకరు నవతెలంగాణ కు తెలిపారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పోడు భూముల రైతులకు పట్టాలు అందించేందుకుగాను దరఖాస్తులు స్వీకరించారు. ఉమ్మడి జిల్లాలో 29, 949 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా నల్గొండ జిల్లాలో 20,446 దరఖాస్తులు రాగా, సూర్యాపేట జిల్లాలో 7,373 దరఖాస్తులు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 2130 దరఖాస్తులు వచ్చాయి. నల్గొండ జిల్లాలో అత్యధికంగా మిర్యాలగూడ డివిజన్‌లో 12,337 దరఖాస్తులు వచ్చాయి.

ఉమ్మడి జిల్లాలో 20 మండలాల్లో పోడు భూములు

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 20 మండలాల్లో పోడు భూములు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో పేద గిరిజన రైతులు సాగు చేసుకుంటున్నట్లు గుర్తించి దరఖాస్తులు స్వీకరించి సర్వే చేపట్టారు. ఇందులో నల్గొండ జిల్లాలో 13 మండలాలు అడవిదేవులపల్లి, చందంపేట, చింతపల్లి, దేవరకొండ, గుండ్లపల్లి, మిర్యాలగూడ, నేరేడుగొమ్ము, నిడమనూరు,, పీఏ పల్లి, పెద్దవూర, తిరుమలగిరి సాగర్, త్రిపురారం మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 119 గ్రామపంచాయతీలు 160 ఆవాసాలు ఉన్నాయి. మొత్తం 55,702 ఎకరాలు పోడు భూములు ఉన్నాయి. దీనికి 20,446 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా మిర్యాలగూడ డివిజన్లో 10,046 మంది గిరిజన రైతులు, 2291 మంది ఇతర రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. వీటి పరిధిలో 33,276 ఎకరాల భూమి ఉన్నది. సూర్యాపేట జిల్లాలో చింతలపాలెం, మట్టంపల్లి, మేళ్లచెరువు, పాలకీడు మండలాలున్నాయి. 20,503 ఎకరాలకు గాను 7372 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో తుర్కపల్లి, నారాయణపుర్, చౌటుప్పల్ మండలాల్లో 6133 ఎకరాలకు గాను 2130 దరఖాస్తులు వచ్చాయి.

10 నుంచి 20 శాతం దరఖాస్తులకే ఆమోదం

ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులలో కేవలం 10 నుంచి 20 శాతం దరఖాస్తులకే అధికారులు ఆమోదం తెలిపినట్లు సమాచారం. వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించినప్పటికీ సమగ్రంగా విచారణ జరపలేదని ఆరోపణలు ఉన్నాయి. పేద గిరిజన రైతులు కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్న ఏదో ఒక సాకు కారణంగా వారిని అనర్హులుగా గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. నల్గొండ జిల్లాలో కేవలం 20% దరఖాస్తులకే ఆమోదం తెలుపగా మిగిలిన జిల్లాలో 10శాతం మాత్రమే ఆమోదం తెలిపినట్లు సమాచారం. నల్గొండ జిల్లా మిర్యాలగూడ డివిజన్లో 2097 మంది దరఖాస్తులను 1327 ఎకరాలకు ఆమోదం తెలిపి ఎఫ్ఆర్‌సికి నివేదిక పంపినట్లు సమాచారం. సూర్యాపేట జిల్లాలో 5,575.35 ఎకరాలకు గాను 2262 మంది రైతుల దరఖాస్తులను ఆమోదించినట్లు తెలిసింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో మాత్రం కేవలం 200 పై చిలుకు దరఖాస్తులకు మాత్రమే ఆమోదం పొందినట్లు సమాచారం. మిగిలిన దరఖాస్తులపై సమగ్రంగా విచారణ జరిపి అర్హులైన పేదలందరికీ పట్టాలు పాసుబుక్కులు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు

పట్టాలు, పాసుబుక్కులు పంపిణీకి కసరత్తు

పోడు భూముల రైతులకు పట్టాలు పాస్ పుస్తకాలు అందించేందుకు అధికార యంత్రం కసరత్తు చేపట్టింది. ఇప్పటికే సర్వే పూర్తి చేసి అర్హులను గుర్తించగా వారి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. లబ్ధిదారులకు పట్టాలు పాస్ పుస్తకాలు అందించేందుకు అంత సిద్ధం చేశారు. పట్టాలు పాస్వర్పుకాలపై ఉన్నతాధికారుల డిజిటల్ సంతకాలు పూర్తయినట్లు తెలిసింది. వాస్తవానికి ఈనెల ఆరో తేదీన పట్టాలు పాస్ పుస్తకాలు ఇవ్వాలని జిల్లా అధికారులకు ప్రభుత్వం నుండి సూత్రప్రాయంగా ఆదేశాలు అందడంత ఆ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అధికారిక ఆదేశాల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.

మిగిలిన దరఖాస్తులను కూడా సమగ్రంగా విచారించాలి
వీరేపల్లి వెంకటేశ్వర్ల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు



పోడు భూముల రైతులకు పట్టాలు ఇచ్చే విషయంలో అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టలేదు. వచ్చిన దరఖాస్తులలో అతి తక్కువ దరఖాస్తులకే ఆమోదం తెలిపినట్టు తెలిసింది. ఎన్నో ఏళ్లగా పోడు భూములు సాగు చేసుకున్న రైతులకు వివిధ కారణాల చేత అనర్హులుగా ప్రకటించడం సరిదికాదు. తిరస్కరించిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించాలి. చిన్నచిన్న కారణాలకు మినహాయింపు ఇచ్చి వారందరినీ కూడా అర్హులుగా గుర్తించి పట్టాలు పాసుపుస్తకాలు ఇవ్వాలి. సాగు చేసుకుంటున్న రైతులందరికీ అర్హులుగా గుర్తించాలి.

వర్ధెల్లి బుచ్చిరాములు ఆశయ సాధన కోసం కృషి చేయాలి

- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి**

నవతెలంగాణ-సూర్యాపేట

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు వర్ధెల్లి బుచ్చిరాములు ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి కోరారు.శనివారం ఆపార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో బుచ్చిరాములు వర్ధంతి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుచ్చిరాములు సూర్యాపేట-తుంగతుర్తి నియోజకవర్గాలకు ఉమ్మడి డివిజన్ కార్యదర్శిగా చాలాకాలం పనిచేశారన్నారు.పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని తెలిపారు.ఆ రోజుల్లో అరాచకవాదులకు వ్యతిరేకంగా తుంగతుర్తి నియోజకవర్గంలో పెద్దఎత్తున పోరాటం చేసి అనేకమంది కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడారన్నారు.తన యావత్ జీవితం పార్టీ కోసం, ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసిన మహానేత అని కొనియాడారు.పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యునిగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులుగా ఉమ్మడి జిల్లాలో ఆయన పార్టీకోసం చేసిన కృషి మరువలేనిదన్నారు. నేటి యువత బుచ్చి రాములు ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.అంతకుముందు బుచ్చిరాములు చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు చిన్నపంగ నర్సయ్య, నాయకులు మామిడి సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నేతలపై మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్



నవతెలంగాణ-సూర్యాపేట

బీజేపీకి రాజకీయాలు, ఓట్లే తప్ప సంస్థలు , వ్యక్తులు , ప్రజల పట్ల గౌరవంలేదని, గవర్నర్ ప్రసంగం పై వారు చేసిన వ్యాఖ్యలే దీన్ని స్పష్టం స్పష్టం చేస్తున్నాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు.శనివారం జిల్లాకేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు.అసెంబ్లీలో గవర్నర్ అబద్దాలు చెప్పారన్న బీజేపీ నేతల వ్యాఖ్యలపై మంత్రి మండిపడ్డారు.గవర్నరే వారికీ సమాధానం చెప్తారని తెలిపారు.గవర్నర్ ప్రసంగాన్ని వ్యతిరేకించడమంటే గవర్నర్‌ను అవమానించినట్టేనన్నారు. రాజ్యాంగసంస్థలను, రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారి గౌరవాన్ని తగ్గించే ప్రయత్నం బీజేపీ చేస్తుందని ధ్వజమెత్తారు.బీజేపీ నేతలు గవర్నర్ ప్రసంగాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు.ఇప్పుడు గవర్నర్‌తో అబద్దాలు మాట్లాడించామంటున్న బీజేపీ నేతలు ఇన్ని రోజులు వారు అబద్దాలే మాట్లాడించారని మేము భావించాలా అని ప్రశ్నించారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- **ఎంపీపీ గుండగాని కవిత రాములుగౌడ్**

నవతెలంగాణ-తుంగతుర్తి

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఎంపీపీ గుండగాని కవిత రాములుగౌడ్ అన్నారు.శనివారం మండలకేంద్రంలోని మేరీమదర్ పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు.ఈ మేరకు విద్యతోనే అభివృద్ధి ముడిపడి ఉందని,నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు.లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివినట్టయితే సాధించలేనిదంటూ ఉండదన్నారు.చదువు ఒక్కటే ముఖ్యం కాదని విద్యార్థులు మిగిలిన వాటిపై కూడా దృష్టి సారించాలని సూచించారు.బాల్యం దేవుడిచ్చిన వరమన్నారు.నేటి బాలలే రేపటిపౌరులుగా,భారతదేశ భాగ్య విధాతలుగా, నవభారత నిర్మాతలుగా, రాబోయే కాలానికి కాబోయే కరదీపికలని గుర్తు చేశారు.అనంతరం ఉత్తమ బోధన చేసిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మేరివిజ్జి, మేనేజర్ అలేసియా, వైస్ ప్రిన్సిపాల్ మేరీరిన్సీ స్వపరిపాలన దినోత్సవ వేడుకల్లో పాత్రలు పోషించిన విద్యార్థుల వివరాలు ప్రిన్సిపాల్‌గా తుంగపాటి వర్షిత,విద్యాశాఖ మంత్రిగా



నలమాసనిఖిత,ఎంపీగా నారాయణదాసు విష్ణువర్ధన్, ఎమ్మెల్యేగా నరాల వరుణ్‌రెడ్డి,జెడ్పీ చైర్ పర్సన్‌గా పూసపల్లిసంజన, కలెక్టర్‌గా మిట్టగడుపుల కృప, డీఈఓగా భూక్యా కావేరి, ఎంఈఓగా గుణగంటి సాయిశివాని, ఎంపీపీగా బత్తుల స్నిగ్ధహర్షిత,తహసీల్దార్‌గా మిడతపల్లి రమ్య, ఎంపీడీఓగా గూడూరు వరుణ్‌సాయి,పలువురు ఉపాధ్యాయులుగా పాత్రలు పోషించారు.ఈ కార్యక్రమంలో సిస్టర్లు హెలెన్, జ్యోతి పాఠశాల ఉపాధ్యాయ బృందం గోపగానిలింగమూర్తి, సతీష్, వీరమల్లు, నాగరాజు, అశోక్, నబి, మహేష్, సంధ్య, సౌమ్య, సునీత, సుకన్య, సంధ్యారాణి, సఫియా, ఉమా, అనిత, లావణ్య, యమున, మంజుల తదితరులు పాల్గొన్నారు.



పోరాటాల ఫలితంగానే మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల పెంపు

- **5న అభినందన సభలు జరపండి : సీఐటీయూ**

నవతెలంగాణ-నల్లగొండ

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ అనేక పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.1,000 నుండి 3 వేలకు పెంచిందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి పోలే సత్యనారాయణ అన్నారు. శనివారం ప్రభుత్వం జీవోను విడుదల చేయడాన్ని హర్షిస్తూ జిల్లా కేంద్రంలో డైట్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక ఏండ్లుగా అతి తక్కువ వేతనాలతో అప్పులు తెచ్చి వంటలు చేసి పెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల పోరాటాల ఫలితంగా గత సంవత్సరం అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించి అమలు చేయలేదని అన్నారు. గత సంవత్సరం నుండి జీవో విడుదల చేసి అమలు చేయాలని సీఐటీయూ చేసిన పోరాటాల ఫలితంగా శనివారం జీవో విడుదల చేసిందని పేర్కొన్నారు. జీవో విడుదల చేయడానన్నీ సీఐటీయూ హర్షిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ జీవోను గత సంవత్సరం అసెంబ్లీలో ప్రకటించిన నాటి నుండి అమలు చేస్తూ ఏరియర్స్‌తో సహా చెల్లించాలని కోరారు. వేతనాల పెంపు జీవో కోసం పోరాటాలు చేసిన మధ్యాహ్న భోజన కార్మికుల అభినందన సభలు ఆదివారం అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాలలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నల్లగొండ పట్టణ నాయకులు కోయగూర పద్మ, చెరుకు శ్రీలత, నాంపల్లి ధనమ్మ సరోజ, సరస్వతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యకు దరఖాస్తులు

నల్లగొండ కలెక్టరేట్ : విద్యా సంవత్సరం 2023-24కు సంబంధించి గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రవేశాలకై విద్యార్థుల నుండి దరఖాస్తుల కోరుతున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఆర్సీఓ కే. లక్ష్మయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2023 వ సంవత్సరంలో పదవ తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్న గిరిజన విద్యార్థులు tgtwgurkulam. telangana. gov. in ద్వారా 100 రూపాయలు చెల్లించి ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9121174434 ను సంప్రదించాలని పేర్కొన్నారు.



మర్రూరులో పర్యటించిన గంగాధర్‌రావు

నవతెలంగాణ-నకిరేకల్



గుడ్ మార్నింగ్ మర్రూర్ కార్యక్రమంలో భాగంగా బీఆర్‌ఎస్ నాయకులు బచ్చుపల్లి గంగాధర్‌రావు మండలంలోని మర్రూరు గ్రామంలో పర్యటించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ బచుపల్లి శ్రీదేవి నిధుల నుండి మంజూరైన డ్రెయినేజీ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు భీమనపల్లి సతీష్, పుట్ట వెంకటమ్మ, పుట్ట శ్రవణ్, ఉపేందర్, సైదులు, నక్కల గణేష్, కుర్ర నాగరాజు, మంగదుడ్ల మహేష్, లొడంగి అజయ్, బీజీఆర్ సైన్యం ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవలందించినప్పుడే గుర్తింపు

- జెడ్పీ చైర్మెన్ బండ నరేందర్ రెడ్డి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించినప్పుడే అధికారులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని జెడ్పీ చైర్మెన్ బండ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. నార్కట్‌పల్లి మండలం తహసిల్దార్‌గా భాధ్యతలు చేపట్టిన పులి సైదులు శనివారం జడ్పీ చైర్మెన్ బండ నరెందర్ రెడ్డిని నల్లగొండలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మెన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, స్థానిక డిప్యూటీ తహసిల్దార్ మురళీమోహన్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇండ్లు, స్థలాలివ్వాలి



పెద్దవూర

నవతెలంగాణ-పెద్దవూర

అర్హులైన పేదలందరికి ఇండ్లు, స్థలాలు ఇవ్వాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కూన్‌రెడ్డి నాగిరెడ్డి అన్నారు. శనివారం మండల తహసీల్దార్ కార్యాలయం ముందు తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అనంతరం తహసిల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ఎనిమిది సంవత్సరాలుగా తెలంగాణ ప్రభుత్వం ఒక్కరికి కూడా ఇల్లు గాని, ఇండ్ల స్థలంగాని ఇవ్వకుండా మాటలతో కాలయాపన చేస్తుందని ఆరోపించారు. పేదలకు ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి 120 గజాల చొప్పున పంపిణీ చేసి ఇండ్ల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు, అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల ఆర్థిక సహకారం చేయాలని కోరారు. పేదవాళ్ళు సాగు చేసుకుని జీవిస్తున్న ప్రభుత్వ భూములకు పట్టాలను ఇవ్వాలన్నారు. ఫిబ్రవరి 9న ఇందిరాపార్క్ దగ్గర జరిగే మహా ధర్నాకు ఇల్లులేని పేదలంతా



హాలియా

పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దోరెపల్లి మల్లయ్య, చెన్ను లచ్చిరెడ్డి, తుడుమ్మ వెంకటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హాలియా : అర్హులైన పేదలకు ఇండ్లు ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కూన్‌రెడ్డి నాగిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హాలియా మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. హాలియా పరిధిలో గత 20 సంవత్సరాల క్రితం పేదల నివాసాల కోసం ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు భూమిని కొనుగోలు చేసి ప్రతి ఎన్నికల ముందు పంపిణీ చేస్తామని ఆరటం మాత్రమే చేశారు. కానీ ఆచరణ మరిచారని ఆవేదన వ్యక్తపరిచారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలో పేదలు సొంత ఇల్లు లేక పెరిగిన అద్దెలతో సంపాదనలో సగం అద్దెలు కట్టడానికే సరిపోతుందని వస్తులతో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. హాలియాలో 48 సర్వే నెంబర్లో నివాసముంటున్న వందలాది మంది పేదలకు తక్షణమే ఇంటి పట్టాలు ఇచ్చి రోడ్లు డ్రయినేజీ, కరెంటు, మంచినీరు సౌకర్యం కల్పించాలన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ భూమిని సేకరించి అర్హులైన పేదలకు పంపిణీ చేసి, డబల్ బెడ్ రూమ్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అవుతా సైదులు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి నాయకులు పొదుల వెంకన్న, కారంపూడి ధనమ్మ, అన్నెపాక శ్రీనివాస్, అనుముల అంజి, ఎస్ కే.జానీ, ఆంజనేయులు, సైదమ్మ, కాశమ్మ, దాసు, ఈదయ్య, శ్రీను, లక్ష్మమ్మ, వెంకటేశ్వర్లు లింగయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ :తెలంగాణ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా



నకిరేకల్

సంఘాల ఆధ్వర్యంలో శనివారం శాలిగౌరారం తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల మాట్లాడుతూ అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ. లక్ష వరకు రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు చలకాని మల్లయ్య, వివిధ ప్రజాసంఘాల నాయకులు మక్కా బుచ్చి రాములు, కల్లూరి లింగయ్య, సిరివంగి రాములు, గద్దపాటి అరవింద్, బట్ట లింగ ప్రసాద్, చలకాని పరమేష్, ఎం సందీప్, శ్రీశైలం, కల్లూరి అంజయ్య పాల్గొన్నారు.



నల్లగొండరూరల్

నల్లగొండరూరల్ : తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలు కాలేదని, అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఇంటి స్థలం నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. శనివారం కనగల్ తహసీల్దార్ కార్యాలయం ముందుధర్నా నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఫిబ్రవరి 9వ తేదీన చలో ఇందిరాపార్క్ ధర్నాను జయప్రదం చేయవలసిందిగా మండల ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కందుల సైదులు, రైతు సంఘం నాయకులు బ్రహ్మానంద రెడ్డి, మహిళా సంఘం కార్యదర్శి ఎండీ. సుల్తానా, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు ఎండీ. అక్రమ్, కేవీపీఎస్ మండల కార్యదర్శి అంజి తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు :అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో సీపీఐ(ఎం) మండల కమిటి



నిడమనూరు

ఆధ్వర్యంలో మండల డిప్యూటీ తహసీల్దార్ రషీద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేష్, నల్లబోతు సోమయ్య, కోదండ చరణ్ రాజు, పొట్టేపాక అంజయ్య, ఇంజమూరి శివ, కోతి ఇంద్రారెడ్డి, కొండేటి సామంతు, మెరుగు రాములు తదితరులు ఉన్నారు.



తిరుమలగిరి సాగర్

తిరుమలగిరి సాగర్ : పేదలకు ఇండ్ల స్థలాలు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుర్ర శంకర్‌నాయక్, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వేములకొండ పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎమ్మార్వో ఆఫీస్‌లో ప్రజా సంఘాల నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జటావత్ రవి నాయక్, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు రమావత్ నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి : మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో



మాడుగులపల్లి

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శనివారం అర్హులైన మండల ప్రజలందరికీ ఇండ్ల స్థలాలు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు పుల్లెంల శ్రీకర్, దేవిరెడ్డి అశోక్ రెడ్డి, తంగెళ్ళ నాగమణి,బొమ్మ కంటి అంజయ్య, బోరబండ శ్రీను, మల్లారెడ్డి, నాగయ్య, లక్ష్మయ్య, కవిత, జానమ్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర క్వింటాకు రూ.12 వేలు ఇవ్వాలి

- రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బండ శ్రీశైలం

నవతెలంగాణ-మునుగోడు



పత్తి మద్దతు ధర క్వింటాకు రూ.12 వేలు కలిపించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి, ప్రభుత్వం ప్రతి పథకమును కౌలు రైతులకు వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు, రైతు సంఘం నాయకులు సాగర్ల మల్లేష్, వడ్లమూడి హనుమయ్య, సీహెచ్ వీరమల్లు, నారబోయిన నరసింహ, బొందు అంజయ్య మాజీ సర్పంచ్ సింగపంగా గౌరయ్య, బోడిసే సత్తయ్య, బొందు ముత్యాలు, సీహెచ్ రజిత, ఇరగదిండ్ల ఇద్దయ్యా, పగిళ్ల సైదులు, జీడిమెట్ల సైదులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

- అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలి
- డీఎస్పీకి జర్నలిస్టుల వినతి

నవతెలంగాణ-మిర్యాలగూడ



యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో నవతెలంగాణ విలేకరిగా పనిచేస్తున్న అనిశెట్టి యాదగిరిపై మున్సిపల్ చైర్మెన్ భర్త అనుచరులు దాడి చేసి గాయపరిచారని, వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, విలేకరిపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం డీఎస్పీ వెంకటగిరికి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఆయూబ్ మాట్లాడుతూ మోత్కూరు మున్సిపాలిటీ చైర్మెన్‌పై వార్తలు రాసినందుకు చైర్పర్సన్ భర్త అనుచరులు ఫిబ్రవరి ఒకటో తేదీన విలేఖరి యాదగిరి ఇంటిపై దాడి చేసి గాయపరచారన్నారు. అడ్డువచ్చిన భార్య, తల్లిపై కూడా దాడి చేశారని చెప్పారు. విలేఖరి యాదగిరి తన భార్యతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయకుండా ఎస్సై రాజీ కోసం విలేఖరి యాదగిరిని ఇబ్బందులు పెట్టారని తెలిపారు. రెండు రోజుల వరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, యాదగిరి భార్య ఇచ్చిన పిటిషన్ కాకుండా యాదిగిరి చేత మరో పిటిషన్ రాయించుకొని కేసు నమోదు చేశారని, అంతకుముందే చైర్పర్సన్ భర్త అనుచరులు విలేకరి యాదగిరిపై ఫిర్యాదు చేసినట్టు సృష్టించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఎస్సై ఏకపక్షంగా వ్యవహరిస్తూ విలేకరి యాదగిరిని ఇబ్బందులు గురి చేస్తున్నాడని తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. యాదగిరి పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శంకర్‌నాయక్ మాట్లాడుతూ పత్రిక స్వేచ్ఛను భంగం కలిగించే విధంగా పాలకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వాస్తవాలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులపై దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. యాదిగిరిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని అతనిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఖాజా హామీదుద్దీన్, నామిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఖాజా నజిమోద్దీన్, మంద సైదులు, జయరాజు, మహేష్, నాగరాజు, మహమ్మద్ నాసర్ అహ్మద్, రఫీఉద్దీన్, పగిడి రామకృష్ణ, నాగేందర్, బాబు కతోజు నాగచారి, రాచకొండ రమేష్, జాని, ఉమర్, శ్రీనునాయక్, శ్రీను, ఉమ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

- జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి శంకరయ్య

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

గోపాలకృష్ణ గొర్రెల పెంపకం దారుల సహకార సంఘానికి రైతు 5 ఎకరాల భూమిని అమ్మి ఆ భూమిలోని 20 గుంటలను తిరిగి అక్రమంగా తన కొడుకు పేరు మీద చేయించిన తప్పుడు రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి తిరిగి ఆ భూమిని సొసైటీకి అప్పగించాలని గొర్రెల, మేకల పెంపకం దారుల నల్లగొండ జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య కోరారు. జీఎంపీఎస్ సొసైటీకి చెందిన భూమిని అక్రమంగా తన కొడుకు పేరు మీద చేసిన పట్టాను రద్దు చేయాలని కోరుతూ శనివారం వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు బండా శ్రీశైలం, నల్లగొండ జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ టీ. వినయ్ కృష్ణారెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలంలోని అంతంపేట గ్రామానికి చెందిన గోపాలకృష్ణ గొర్రెల పెంపకం దారుల సహకార సంఘానికి 2004 వ సంవత్సరంలో భూమి కొనుగోలు పథకం ద్వారా సొసైటీ అభివృద్ధి కోసం 5 ఎకరాల భూమిని కొనుగోలు చేసి సొసైటీ సభ్యులు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి వెబ్‌సైట్‌లో జరిగిన పొరపాట్లను ఆసరాగా చేసుకుని సొసైటీకి అమ్మిన రైతు రెవెన్యూ రికార్డులో తన పేరు వస్తున్న 20 గుంటల భూమిని అక్రమంగా తన కుమారుని పేరున రిజిస్ట్రేషన్ చేయించాడని ఆరోపించారు. గొర్రెల పెంపకం దారుల సొసైటీని మోసం చేసిన సదరు రైతుపై చట్టపరంగా చర్యలు తీసుకొని, రెవెన్యూ రికార్డును పరిశీలించి రైతు తన కుమారుడు శ్రీకాంత్ పేరు మీద చేసిన తప్పుడు రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి ఆ భూమిని తిరిగి సొసైటీ పేరు మీద రికార్డులో నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా సదస్సులు జయప్రదం చేయాలి...

ఫిబ్రవరి 8వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే జీఎంపీఎస్ జిల్లా సదస్సుకు జిల్లాలోని సొసైటీ అధ్యక్షులు, గొర్ల మేకల పెంపకం దారుల సంఘ శ్రేయోభిలాషులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.జిల్లా వ్యాప్తంగా సీజనల్గా వస్తున్న వ్యాధుల నివారణ కోసం ప్రభుత్వం వెంటనే వ్యాక్సిన్లు వేయాలని, సంచార వైద్య బృందాల ద్వారా అన్ని మండల కేంద్రాల్లో వ్యాధి నివారణ చర్యలు చేపట్టే విధంగా కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు దాసరి రమేష్, సురికి రాఘవేంద్ర, సురేష్, దండిగ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పాదయాత్రను జయప్రదం చేయండి



నవతెలంగాణ-నల్లగొండ రూరల్

తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పాలకుర్తి నుండి పట్టణం వరకు 300 కిలోమీటర్లు 17 రోజులు సాగే పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ కార్మికులను కోరారు. శనివారం నల్లగొండ మండలం నర్సింగ్ బట్ల గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి పాదయాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 28న పాదయాత్ర ముగింపు సభకు కార్మికులందరూ హైదరాబాదు ఇందిరాపార్కు వద్దకు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వడ్డేపల్లి యాదయ్య, చింతకింది భద్రయ్య, రాములు, ఆకారపు చిన్న, సోనబోయిన పరమేష్, వరికుప్పల పాండు, పుట్ట రాంబాబు, మర్రి శంకర్, కంభం ఈదయ్య, ఎల్లయ్య, మల్లయ్య, కందుల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

శిష్య పాఠశాలలో స్వపరిపాలనా దినోత్సవం

నవతెలంగాణ-మిర్యాలగూడరూరల్



పట్టణంలోని శిష్యా పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి పలువురిని ఆకట్టుకున్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచి గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాసరెడ్డి బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు ఉపాధ్యాయ వృత్తిలో, వివిధ రంగాల్లోనీ బాధ్యతలను ప్రత్యక్షంగా నిర్వహించడం వల్ల వారిలో గల సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికి తీయవచ్చన్నారు. నేటి బాలలే రేపటి పౌరులుగా ఎలా ఎదగాలో పాఠశాలలో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలే దోహద పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అడుగుబెల్లి శిరీష, ఉపాధ్యాయులు అంజయ్య చారి, రమేష్, నాగరాజు, పద్మావతి, వసంతలక్ష్మి, స్వాతి ప్రియా, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నల్లగొండ కలెక్టరేట్ : బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 1వ తరగతి డే స్కాలర్స్, 5వ తరగతి నందు రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రవేశం కల్పించడం కోసం అర్హత కలిగిన ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ టీ.వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల ప్రారంభం నుండి ప్రభుత్వ గుర్తింపు పొంది ఉండాలని, గత ఐదు సంవత్సరాల నుండి 7వ 10వ తరగతి యందు 90 శాతం పైన విద్యార్థులు ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. అందులో 50 శాతం విద్యార్థులు మొదటి తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలి, అంతేకాకుండా పాఠశాలలో అన్ని వసతులు, మౌలిక సదుపాయాలు, పనిచేసే సిబ్బంది ప్రభుత్వ నియమావళి ప్రకారం నడుచుకొని ఉండాలని, పాఠశాల సొంత భవనంతో పాటు ఆటస్థలం కూడా కలిగి హాస్టల్ వసతి కూడా ఉండాలని తెలిపారు. హాస్టల్ వసతి బాల, బాలికలకు వేరువేరుగా ఉండాలని పేర్కొన్నారు. సూచించిన అర్హత కలిగిన ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈనెల 15వ తేదీలోగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం నల్లగొండ నందు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఔరావానిలో... అవస్థలే...!

- ఫోన్ మాట్లాడాలంటే మిద్దెక్కాల్సిందే..
- పెంఛన్ కోసం వేరే ఊరికి వెళ్లాల్సిందే..
- నేటికీ..ఆ ఊరికి బస్సు రాదు...
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎప్పుడు పూర్తి చేస్తారో..?
- ఔరా వానికి.. చుట్టూ ప్రజాప్రతినిధులే..

నవతెలంగాణ-నార్కట్‌పల్లి ఎండీ. సాదత్ అలి

ప్రపంచం అబ్బురపడే విధంగా జీ20 సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న మన దేశం ఇంకా రవాణా వ్యవస్థ, ఇంటర్నెట్, వైద్యం ఆమడ దూరంలో ఉండి నేటికీ అంధకారంలో నెట్టుకొస్తున్న గ్రామాలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. అలాంటి కోవలోనే మండలానికి చివరి గ్రామం అయిన ఔరవానికి అన్ని అవస్థలే ఉన్నాయి. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా జిల్లా కేంద్రానికి 14 కిలోమీటర్లు మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. ఈ గ్రామానికి చుట్టూ రాష్ట్రస్థాయిలో పేరు పొందిన ప్రజాప్రతినిదులు ఉన్నప్పటికీ అన్నీ సమస్యలతో నేటికీ ఔరావాణిలో అంధకారమే !



ఫోన్ మాట్లాడాలంటే మిద్దెక్కాల్సిందే..

ఇది ఏంటి.? ఫోన్ మాట్లాడాలంటే మిద్దెక్కాల్సింది అంటున్నారు. ఇక్కడ ఏమైనా రహస్యాలు మాట్లాడుకుంటారా..? అందరూ గోప్యంగా ఉంటారా.? అని అనుకుంటే మీరు పప్పులో కాలేసినట్టే.! భారతదేశం వెలిగిపోతుంది. జీ20 సదస్సుకు ఆతిథ్యమిస్తున్నాం అని గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం ఈ ఊరికి నేటి వరకు ఇంటర్నెట్ కనెక్షన్ లేదు. ఏ నెట్‌వర్క్ టవర్ లేకపోవడం గమనార్హం. అదే మరి ఫోన్ మాట్లాడాలంటే టవర్ కోసం సమయంతో సంబంధం లేకుండా ఎవరైనా మిద్దెక్కితేనే స్పష్టంగా వినబడుతుంది. పూర్తిస్థాయిలో మాట్లాడగలుగుతారు. అందుకే మరి ఫోన్ మాట్లాడాలి అంటే మిద్దె కావాల్సిందే.! నేడు ప్రపంచం మొత్తం ఇంటర్నెట్‌తో కొనసాగుతున్న తరుణంలో ఈ గ్రామానికి నెట్ సౌకర్యం లేకపోవడంతో కరోనా కష్ట కాలంలో విద్యార్థులు ఆన్‌లైన్ క్లాసులకు పూర్తిస్థాయిలో దూరంగా ఉన్నారు.

పింఛన్ కోసం వేరే ఊరికి వెళ్లాల్సిందే..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధిలో పోటీపడుతున్నామని ఎవరికి వారే గొప్పలు చెప్పుకుంటున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ తీసుకోవడానికి గ్రామంలో నెట్‌వర్క్ రాకపోవడంతో పోస్ట్ ఆఫీస్ సిబ్బంది ప్రతినెల పింఛన్ పంచడానికి నానా అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఆ గ్రామంలో సుమారు 280 మంది పింఛన్‌దారులు ఆ గ్రామానికి సమీపాన ఉన్న నల్లగొండ మండలం అప్పాజీపేట గ్రామానికి 100 రూపాయలు ఛార్జ్ పెట్టుకొని పెన్షన్‌కి వెళ్లి రోజు మొత్తం తమవంతు వచ్చేదాకా ఆ గ్రామంలో పెన్షన్ దారులు క్యూ లైన్‌లో నిలబడి పెన్షన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటికీ..ఆ ఊరికి బస్సు రాదు...

ఆర్టీసీ రథచక్రం అభివృద్ధికి దిక్సూచిక అని చెప్పుకునే ఆర్టీసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు సిగ్గుతో తలవంచుకోవాల్సిన దుస్థితి. జిల్లా కేంద్రానికి కేవలం 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఔరవాణి గ్రామానికి నేటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించకపోవడం దారుణం. ఆ గ్రామంలో జిల్లా కేంద్రానికి వెళ్లాలన్నా, మండల కేంద్రానికి రావాలన్నా సొంత వాహనాన్ని ఏర్పాటు చేసుకోవడం, అద్దెకు ఆటో మాట్లాడుకోవాల్సిందే. నల్లగొండ నుంచి బ్రాహ్మణ వెల్లంల వరకు సుమారు 20 ఆటోలు ఉదయం నుంచి సాయంత్రం వరకు రాకపోకలు చేస్తున్నారు. ఆ ఊరిలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు ఆ ఊరు నుంచి ఇతర గ్రామానికి వెళ్లే విద్యార్థులు రైతులు ఆర్టీసీ బస్సు లేక నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి దాపురించింది. ఉన్నత చదువుల కోసం ఊరును వదిలిపెట్టి తమకు కావలసిన బంధువులలో ఉండడం లేక హాస్టల్లో ఉండడం చేయాల్సిన పరిస్థితి ఉందని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎప్పుడు పూర్తి చేస్తారో..?

మండలానికి చివరికి గ్రామీణ గ్రామం అయినా ఔరవారిలో బడుగు బలహీన వర్గాలకు చెందిన అల్ప సంఖ్య వర్గం అత్యధికంగా ఉందని



ఆలోచనతో నకిరేకల్ మాజీ శాసనసభ్యులు వేముల వీరేశం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మాణం చేసేందుకు ఎంపిక చేసి నిర్మాణం చేపట్టి కూడా ఐదు సంవత్సరాలు కావస్తున్నా నేటికీ పూర్తిస్థాయిలో పనులు కాలేదు. పనులు పూర్తయ్యేది ఎప్పుడు? పేదలకు పంచేది ఎప్పుడో? అని ఆ గ్రామస్తులు వాపోతున్నారు.

ఔరావానికి.. చుట్టూ ప్రజాప్రతినిధులే..

ఔరవాణి గ్రామానికి చుట్టు రాష్ట్రస్థాయిలో పేరుపొందిన నాయకులు ఉండడం గర్వకారణం. ఔరవాణి గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రాహ్మణ వెల్లంల గ్రామానికి చెందిన రాజకీయ ప్రముఖులు కూడా పక్క గ్రామానికి చెందినవారే. అయినా ఈ గ్రామానికి నేటికీ రవాణా వ్యవస్థ ఇంటర్నెట్ వైద్యం అందుబాటులో లేదు.

పెన్షన్ పొందాలంటే పక్క గ్రామానికి వెళ్లాల్సిందే

సిలువేరు యాదయ్య (పెన్షన్ దారుడు)



రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పెన్షన్ తీసుకోవడానికి 100 రూపాయలు ఖర్చు చేసుకొని పక్క గ్రామమైన అప్పాజీపేటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఆరోగ్యం సహకరించబడినప్పటికీ ప్రత్యేకంగా ఆటోను మాట్లాడుకొని పోవాల్సి వస్తుంది.


వృత్తిదారులకు రూ.20వేల కోట్లు కేటాయించాలి

నవతెలంగాణ-మునుగోడు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా వృత్తిదారులకు 20వేల కోట్ల రూపాయలు అన్ని వృత్తులకు బడ్జెట్లో కేటాయించాలని బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. శనివారం మునుగోడు మండల కేంద్రంలో వడ్డెర వృత్తిదారుల సంఘం క్యాలెండర్‌ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ఎనిమిదేండ్ల కాలంలో బడ్జెట్‌లో కేటాయించేటువంటి డబ్బులు కూడా కేటాయించినట్లే కేటాయించి ఖర్చు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల మునుగోడు ఉపఎన్నిక సందర్భంగా గొర్ల, మేకల పెంపకం దారులకు నగదు బదిలీ పథకం చేస్తానని పెంపకం దారులకు



హామీ ఇచ్చి తమ అకౌంట్లో డబ్బులు ట్రాన్స్ఫర్ పడిన తర్వాత అకౌంట్‌లో పెట్టి డబ్బులు వాడుకోకుండా పెంపకం దారులను అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీరు ఓడ ఎక్కిన తర్వాత ఓడ మల్లయ్య ఓడ దిగిన తర్వాత బోడి మల్లయ్య అన్నట్టుగా ఈ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల అనంతరం వృత్తిదారులందరినీ విస్మరించింది. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృత్తిదారుల సమస్యలు పరిష్కరించి వృత్తిదారులకు ఇచ్చిన హామీలను వృత్తిదారులకు 50 సంవత్సరాలు నిండిన వాళ్లకి పింఛన్లు , అరులైన పేదలందరికీ ఇంటి స్థలానికి ఐదు లక్షల రూపాయలు, అదే రకంగా వృత్తి సంక్షేమం, వృత్తి రక్షణ కోసం ప్రభుత్వం విధి విధానాల బడ్జెట్‌ని కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునుగోడు సర్పంచ్ మిర్యాల వెంకన్న, తెలంగాణ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉరుకుప్పల ముత్యాలు, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నాంపల్లి చంద్రమౌళి, తెలంగాణ గొల్ల కురుమల వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు సాగర్ల మల్లేష్, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ధనుంజయగౌడ్, యాసరాని శ్రీను, తదితరులు ఉన్నారు.



తుంబాయిగడ్డ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన

నవతెలంగాణ-గరిడేపల్లి

మండలపరిధిలోని తుంబాయిగడ్డ ప్రాథమిక పాఠశాలలో స్వరిపాలనా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారిగా భార్గవ్, ప్రధానోపాధ్యాయులుగా ప్రవీణ్, చైర్మెన్‌గా హేమంత్,ఉపాధ్యాయులుగా తదితర చిన్నారులు వ్యవహరించారు.ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు ఎస్ఎంసీ చైర్మెన్ స్వాతి బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు మానస, స్వర్ణలత, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాణిక్‌రావుఠాక్రేను కలిసి పటేల్‌రమేశ్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లోఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావుఠాక్రేను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి సూర్యాపేట జిల్లాలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి ఆయనకు వివరించారు.అదేవిధంగా సూర్యా పేట మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఇటీవల కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేసిన పాదయాత్ర విష యాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 6 నుండి ప్రారంభం కానున్న హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర సన్నాహక అంశాల గురించి ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడారు.



సీనియారిటీ లిస్టులో తప్పులను సవరించాలి

నవతెలంగాణ-సూర్యాపేట

జిల్లా విద్యాశాఖాధికారి ప్రకటించిన ఉపాధ్యాయుల ప్రమోషన్ సీనియారిటీ లిస్టులలో చాలా తప్పులు ఉన్నాయని,వాటిని సరిచేసి పారదర్శకంగా ప్రమోషన్లు కల్పించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రేపాక లింగయ్య డిమాండ్ చేశారు.శనివారం స్థానిక డీఈఓ కార్యాలయంలో డీఈఓ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.అంతరజిల్లా బదిలీల్లో వచ్చిన వారిని వెనకకు చూపాలని పేర్కొన్నారు.అన్‌ట్రైన్డ్ డీఎస్సీ వారి సీనియారిటీ విద్యార్హతలు పొందిన తేదీ నుండి లెక్కించాలన్నారు.సోషల్ అర్హతలు ఉన్నవారి పేర్లు బయోసైన్స్ జాబితాలో ఉన్నాయన్నారు.పెన్‌పహాడ్ ఎంపీపీఎస్ అనంతారం లో ఒక ఎస్‌జీటీ పోస్ట్ ఖాళీని చూపించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జి.ఆనంద్ భాస్కర్,రాష్ట్ర కౌన్సిలర్ పబ్బతి వెంకటేశ్వర్లు,జిల్లా కార్యదర్శి బి.క్రాంతికుమార్, సింహాద్రి, పి.భిక్షం తదితరులు పాల్గొన్నారు.



ఉచిత స్టడీ మెటీరియల్ అందజేత

నవతెలంగాణ-మునగాల

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మున గాలలో సర్వేజనా ఫౌండేషన్ కోదాడ వారి ఆధ్వర్యంలో సంస్థ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారి కవితరెడ్డి పదో తరగతి విద్యార్థులకు ఉచిత డిజిటల్ స్టడీ మెటీరియల్ అందజేశారు.ఈ సందర్భంగా సైన్స్‌ఫేర్‌లో దక్షిణ భారత స్థాయి ద్వితీయ బహుమతి పొందిన షేక్‌జాఫర్,రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ అవార్డు పొందిన మునగాల కాంప్లెక్స్ ఉపాధ్యాయిని వై.చంద్రజ్యోతిని సన్మాని ంచారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు అమరేందర్‌రెడ్డి, చైర్‌పర్సన్ కవిత, సభ్యులు ఎమ్మెల్యే రెడ్డి ప్రసాద్, నారా యణరెడ్డి, స్థానిక మునగాల కాంప్లెక్స్ హెచ్ఎం దండు సీతా రామరాజు, ముకుందాపురం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీ రాములునాయక్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వర్ధెల్లి బుచ్చిరాములు సేవలు మరువలేనివి

- బీఆర్ఎస్ నాయకులు బొమ్మిడి లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-సూర్యాపేట

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వర్ధెల్లి బుచ్చిరాములు బడుగు, బలహీన వర్గాల కోసం చేసిన సేవలు మరువలేనివని బుచ్చిరాములు వీరాభిమాని,బీఆర్ఎస్ నాయకులు బొమ్మిడి లక్ష్మీనారాయణ అన్నారు.శనివారం స్థానిక వాణిజ్య భవన్‌సెంటర్‌లో పార్టీ సీనియర్ నాయకులు వర్ధెల్లి బుచ్చి రాములు 4వ వర్థంతి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ బాల్యం నుండి మరణం వరకు పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వాలపై పోరాటాలు చేసి బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి బాటలు వేసిన మహానాయకుడని కొనియాడారు. నేటి తరం యువత బుచ్చిరాములును ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు.నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, బోళ్ళ సోమిరెడ్డి,దేవత్ కిషన్‌నాయక్, నీలకంఠం చలమంద, సవీందర్ నల్లకుంట్ల అయోధ్య,ఇరిగి వెంకయ్య,బొమ్మిడిఅజిత్, చిత్రంభద్రమ్మ,రామలక్ష్మీతో పాటు బుచ్చిరాములు అభిమానులు ఉన్నారు.



పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-గరిడేపల్లి

రాష్ట్ర ప్రభుత్వం పశుసవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి నాగేంద్ర అన్నారు.మండలపరిధిలో ఉన్న కోదండరాంపురం గ్రామంలో పశువైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ వెన్నం రవీందర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు.రైతులు పాడి పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకాల్లో అభివృద్ధి చెందాలని రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ సందర్భంగా వ్యాధిగ్రస్త పశువులకు గర్భకోశ వ్యాధులకు, చూడికట్టని పశువులకు, తిరిగి పొరలే, ఎదకురాని పశువులకు గొర్రెలు, మేకలకు ఉచిత చికిత్స నాలుగు నుంచి 8 నెలల దూడలు 13కి బ్రూసెల్లోసిస్ టీకాలువేయడం, పశువుల యాజమాన్యం పట్ల అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సురేష్, వైద్య సిబ్బంది శేఖర్, అజహర్, ఉపసర్పంచ్ మచ్చరమేష్, కోఆప్షన్ సభ్యులు మందభిక్షం, వైద్య సిబ్బంది శేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌టౌన్

ట్రాన్స్‌పోర్టు రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను అన్నారు.కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7న హైదరాబాదులో చేపడుతున్న ధర్నా, కరపత్రాలను శనివారం పట్టణంలో పంపిణీ చేసి మాట్లాడారు.కార్మికులకు సంక్షేమ గ్రూపు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలన్నారు.పెట్రోల్, డీజిల్ ధరలు, ఇన్సూరెన్స్ ప్రీమియంలు తగ్గించాలని డిమాండ్ చేశారు.పట్టణం, మండలకేంద్రాల్లో ఆటోల పార్కింగ్‌కు స్థలాలు కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చింతకాయలగోపి, శీతల చందు, పొమ్మగంటి వెంకన్న, జక్కులవెంకన్న, ఎస్‌కె.బాబా, వీరబాబు పాల్గొన్నారు.



చేనేత కార్మికులకు బడ్జెట్‌లో సముచితస్థానం కల్పించాలి

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేపెడుతున్న 2023-24 వార్షిక బడ్జెట్‌లో చేనేత పరిశ్రమ పరిరక్షణకుకు చేనేత కార్మికులకు లబ్ధి చేకూర్చే విధంగా బడ్జెట్‌ను రూపొందించాలని మండల చేనేత సమన్వయ కర్త వంగరి బ్రహ్మం ప్రభుత్వాన్ని కోరారు.కేంద్ర ప్రభుత్వం నూలు,రంగులు, రసాయనాలు, నేసిన వస్త్రాలపై కూడాజీఎస్టీ పేరుతో పన్నులు వేసి చేనేత రంగాన్ని అదోగతి పాలు అయ్యేలా చేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం చేనేత రంగంపై తీసుకున్న నిర్ణయం రద్దుచేయాలని డిమాండ్ చేశారు.రాష్టంలో తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికులకు చేనేత చేయూత, చేనేతమిత్ర, చేనేత బీమా లాంటి పథకాలు అమలుచేస్తున్న నిధుల కొరత కారణంగా నెలలు గడుస్తున్న ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ కార్మికుల ఖాతాలో జమ కావడం లేదని పేర్కొన్నారు.జియోటాగ్ కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి సంవత్సరానికి రూ.30 వేల చొప్పున రైతుబంధు మాదిరిగా చేనేత బంధు ప్రకటించి,చేనేతబీమా వయస్సుతో నిమిత్తం లేకుండా చేనేత కార్మికులకు వర్తింపజేయాలని కోరారు.ఇండ్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు, హౌజ్ కం వర్క్‌షెడ్ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసి,కార్మికుల వ్యక్తిగత రుణాలను మాఫీ చేయాలని కోరారు.

పెద్దగట్టు జాతరకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-చివ్వెంల




రాష్టంలోనే రెండవ అతిపెద్ద జాతర శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు)జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి అన్నారు.శనివారం సూర్యాపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు.జాతర సందర్భంగా వచ్చే భక్తుల సౌకర్యార్థం వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కావాల్సిన మౌలిక వసతుల ఏర్పాట్లు చేశామన్నారు.గతంలో గల(7) శాశ్వత మరుగుదొడ్లను రిపేరు చేయడంతో పాటు మహిళలు,పురుషుల సౌకర్యార్థం 30 ప్లేస్‌లలో మొబైల్ (తాత్కాలిక)టాయిలెట్స్ (64) ఏర్పాటుచేశామన్నారు.తాగునీటి వసతి ఏర్పాటు చేయడం, 5రోజుల పాటు పారిశుధ్య నిర్వహణకు గాను రోజుకు 3 షిఫ్ట్‌ల ప్రకారం షిఫ్ట్‌కు 188 మంది చొప్పున మూడు షిఫ్టులకు గాను 564 మంది పారిశుధ్య కార్మికులను,మరుగు దొడ్ల పరిశుభ్రత కోసం స్కావెంజర్లను నియమించామన్నారు.చెత్త తొలగించుటకు షిఫ్టుకు 6 ట్రాక్టర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.పారిశుధ్యం,మరుగుదొడ్ల పర్యవేక్షణ నిర్వహణ కోసం మున్సిపల్ సిబ్బంది కాకుండా అదనంగా 48 పంచాయతీ సెక్రెటరీలు (సూపర్‌వైజింగ్ కోసం)24 మంది జోనల్ అధికారులుగా పంచాయతీరాజ్,జిల్లా పరిషత్ ఏఈ,డీఈలను నియమించామని పేర్కొన్నారు.16 మంది మున్సిపల్ జవాన్లు, ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు (3)షిఫ్ట్ ల వారీగా 45 మందిని సూపర్‌వైజర్లను నియమించారని తెలిపారు.మరుగుదొడ్ల ట్యాంకులు నిండిన వెంటనే వ్యర్థాలు తొలిగించుటకు 3 గల్పర్ మిషన్లు ఏర్పాటు చేశామని చెప్పారు.రాత్రిపూట విద్యుత్ సౌకర్యార్థం ఎల్ఈడీ లైటింగ్,4 జనరేటర్లు గుట్ట చుట్టూ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కోనేరు క్లినింగ్ చేయించి పెయింటింగ్ ,శివుని విగ్రహం ఏర్పాటు చేశామని తెలిపారు.గుట్ట పరిసర ప్రాంతాన్ని జేసీబీ,డోజర్‌ల ద్వారా జంగిల్ క్లియరెన్స్ చేయడంతో పాటు,గుట్టపై నుండి వచ్చే జంతురక్తం రోడ్డు మీదకు రాకుండా ఉండేందుకు గుట్ట వెనక కాలువ నిర్మాణం చేయడంతో పాటు జెట్టింగ్ మిషన్ ఏర్పాటు చేశారని చెప్పారు. పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపట్టామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ఈఈ జీకేడీ.ప్రసాద్ ,డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్,ఏఈలు నరేందర్,రాజురెడ్డి,జూనియర్ అసిస్టెంట్లు ఎండి గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

పెద్దగట్టుకు పోదామా

- నేడు దేవరపెట్టె రాకతో జాతర షురూ
- గుట్ట పైకి మకరతోరణం తరలింపు
- ముస్తాబైన పెద్దగట్టు
- అన్ని ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-సూర్యాపేట

యాదవుల ఆరాధ్యదైవం కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా పేరు గాంచిన గొల్ల గట్టు లింగమంతుల జాతరకు సమయం రానే వచ్చింది.రెండేండ్లకోసారి జరిగే ఈ జాతర నేటి ఆదివారం అర్ధరాత్రి గంపల ప్రదర్శనతో ప్రారంభం కానుంది.సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామంలో గల పెద్దగట్టుపై వెలిసిన లింగమంతుల స్వామి జాతర తెలంగాణలో రెండో అతిపెద్దజాతరగా గుర్తింపు పొందింది. జాతరకు శ్రీ లింగమంతుల స్వామి జాతర, యాదవగట్టు, గొల్లగట్టు, పెద్దగట్టు తదితర పేర్లతో పిలుస్తుంటారు.ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు మహారాష్ట్ర, చత్తీష్‌ఘడ్, జార్ఖండ్



తదితర రాష్ట్రాల నుండి భక్తులు వస్తుంటారు.ఇందుకుగాను ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసింది.

గొల్లగట్టు జాతర...

యాదవ వంశానికి చెందిన ధ్రువ,ధరవర్ష మహారాజు (780 -793) తన పేరిట గ్రామాన్ని నిర్మించారని,ఆ రాజు నిర్మించిన గ్రామమే దురాజ్‌పల్లిగా పేరొందింది.యాదవుల ఆరాధ్య దైవం లింగమంతుల స్వామి కొలువుండే గొల్లగట్టు పూర్వకాలంలో యాదవరాజులు ఉండ్రుగొండ గుట్ట మీద శివాలయం, లక్ష్మీనర్సింహాస్వామి, లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లి, ఆంజనేయుడి దేవాలయాలు కట్టించారు.రెండేండ్లకోసారి జరిగే లింగమంతుల జాతర ప్రారంభానికి 15 రోజుల ముందు దిష్టిపూజ మహోత్సవం జరుగుతుంది.మాఘశుద్ధ పాడ్యమి తర్వాత వచ్చే రెండో ఆదివారం దిష్టికుంభాన్ని, ఉమ్మడి వరంగల్ జిల్లా చీకటాయపాలెం నుంచి దేవరపెట్టెను తీసుకురాగా.. సూర్యాపేట నుంచి మకరతోరణం ఇతర ఆభరణాలు పెద్దగట్టుకు తీసుకొచ్చి అలంకరిస్తారు.ఆదివారం ప్రారంభమైన ఈ జాతర ఐదు రోజుల పాటు జరుగుతుంది.

కోరికలు తీర్చే లింగన్న...

కోరికలు తీర్చే దేవుడు శ్రీ లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతరకు సర్వం సిద్ధమైంది.ఈసారి సుమారు 30 లక్షల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా వేసిన అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేశారు.ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు గంపల ప్రదక్షణలతో జాతర ప్రారంభం కానున్నది.సంప్రదాయ ప్రకారం శనివారం మకరతోరణాన్ని పట్టణంలోని గొల్లబజార్‌లోని యాదవుల ఇంటి నుండి గట్టుపైకి తరలించి స్వామివారికి



అలంకరించారు.

జాతరలో మొదటిరోజు.... గంపల ప్రదక్షిణ.

జాతరలో ఇది కీలక ఘట్టం.దిష్టిపూజ జరిగిన 15 రోజుల తర్వాత ఆదివారం జాతర ప్రారంభమవుతుంది.మాఘ పౌర్ణమి నాడు కేసారం గ్రామం నుండి చౌడమ్మతల్లి ఉన్న దేవర పెట్టెను తీసుకొని యాదవ రెడ్డి కులస్తులు కాలినడకన బయలుదేరి పెద్దగట్టుకు చేరుకుంటారు. ఈ సందర్భంగా ఓ లింగ...ఓ లింగా అంటూ గజ్జల లాగులు, భేరి చప్పుళ్లు, కత్తులతో,కటారు లతో విన్యాసాలు చేస్తారు.మంద గంపలతో దేవాలయం చుట్టూ భక్తులు ప్రదక్షణలు చేస్తారు.మెంతబోయిన, రెడ్డి, గొర్ల, మున్నా వారి సమక్షంలో రెండు బోనాలు చేసి పూజలు నిర్వహిస్తారు. అనంతరం రాజులు, పూజారులు, గొల్ల కులస్తులు అవసరాలు (కత్తులను కడుపునకు అంటుకోవడం) పెడతారు.గొర్రెలను అవసరాలను పెట్టి పూజిస్తారు.బోనాల సమర్పణ ముందుగా మెంత బోయిన, మున్నా, రెడ్డి వంశీయులు బోనాలు చేస్తారు.అదేవిధంగా భక్తులు తమ వెంట తెచ్చిన జంతువులను బలి ఇవ్వడంతో లింగమంతుల స్వామి, చౌడమ్మకు బోనం సమర్పించడం ఆనవాయితీ. ప్రత్యేకమైన పూజా సామగ్రితో నిష్టతో వండుతారు.కొత్త కుండను పసుపు కుంకుమలతో అలంకరించి తమలపాకులు కట్టి వండిన బోనాలను డప్పు చప్పుళ్లు, గజ్జెల లాగులతో విన్యాసాలు చేస్తూ సమర్పిస్తారు.

రెండో రోజు... చౌడమ్మ బోనాలు.

జాతరలో రెండవరోజు సోమవారం చౌడమ్మతల్లి బోనాలు సమర్పిస్తారు.ఇందులో భాగంగా మున్నా వంశీయులు తెచ్చిన బద్దెపాల గొర్రె, రెడ్డి వంశీయులు తెచ్చిన వర్ద గొర్రె, మంతెనబోయిన వారు తెచ్చిన తొలి గొర్రెలను మొదటగా అమ్మవారి ముందు నిలబెట్టి అవసరాలు (కటార్లు అంటించడం) చేస్తారు.అనంతరం మున్నా వంశీయులు ఉపవాసముండి తెచ్చిన భద్దే పాల గొర్రెలు అమ్మవారికి బలి ఇస్తారు.అనంతరం గొర్రె ఆయాలు, సాయాలు(పేగులు, లివర్,కిడ్నీలు, నల్లడా, గుండె మాంసం) నెయ్యిలో వేసి వంట చేస్తారు.మున్నా వంశీయులు



యజమానులుగా,మెంతబోయినవారు జాగిలాలుగా వ్యవహరించి మున్నవారు పట్టుకోగా మెంతబోయిన వారు బండపై వేసిన అన్నం నేరుగా నోటితో తింటారు.

మూడవరోజు చంద్ర పట్నం....

మూడోరోజు మంగళవారం మెంతబోయిన వారు తీసుకొచ్చిన పూజా సామగ్రితెల్ల పిండి, పచ్చపిండి, పసుపు కుంకుమలతో రాజులు, పూజారులు, బైకన్లు కథలు చెపుతారు.చెక్కపై పసుపు కుంకుమలు వేసి అందంగా పట్నం వేస్తారు.అనంతరం యాదవ వంశీయులు స్వామివారి కల్యాణం జరిపిస్తారు.దీంతో చంద్రపట్నం స్వామివారి కల్యాణం తంతు ముగుస్తుంది.సాయంత్రం వరకు మెంతబోయిన వారు కేసారం గ్రామం చేరుకుంటారు.

నాలుగో రోజు నెల వారం...

జాతరలో నాలుగో రోజు బుధవారం జరిగే కార్యక్రమం కేసారం గ్రామం నుండి పాలు తీసుకొచ్చి రెండుకొత్త బోనం కుండల్లో పాలు పొంగిస్తారు.అనంతరం మున్నా వారి గొర్రెను బలిస్తారు.ఈ సందర్భంగా బైకాన్లు భక్కులు కథలు చెప్పడం ద్వారా తంతు పూర్తి చేస్తారు.బలి ఇచ్చిన గొర్రెలకు సగం బైకాన్లు, మెంతబోయిన వారికి సగం ఇస్తారు.అనంతరం ఆయా



వంశీయులకు ఆ మాంసాన్ని వండుకుని తినడం ఆనవాయితీ.ఇలా తినడం వల్ల వంశాభివృద్ధి అవుతుందని వారి నమ్మకం.

ఐదో రోజు ముగింపు...

జాతరలో ఐదో రోజు గురువారం లింగమంతుల స్వామి దర్శనార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు.జాతర తంతు అంతా పూర్తయిన తర్వాత మొత్తం భక్తులు తుదిసారిగా మొక్కులు చెల్లించి ఇంటి ముఖం పడతారు.దీంతో జాతర ముగిసినట్లు ప్రకటిస్తారు.శంభు లింగా అంటూ ఐదు రోజుల పాటు స్వామివారిని పూజించిన లింగమంతుల స్వామి భక్తులు తిరిగి తమ తమ స్వగ్రామాలకు పయనమవుతారు.అనాదిగా సంప్రదాయంగా, లింగమంతుల ఆచారంగా వస్తున్న గొల్లగట్టు జాతరలో మొక్కులు చెల్లించి రెండేండ్ల తర్వాత మరోమారు ఇంతే ఘనంగా జాతరకు వస్తామని లింగమంతుల స్వామికి చెప్పి మరీ వెళ్తారు.ఐదు రోజులపాటు కొండకోనల్లో ఆటపాటలతో భేరీల చప్పుళ్ళతో, ఆ లింగమయ్య నామస్మరణలో భక్తులు ఆనందపారవశ్యంతో పెద్దగట్టు జాతర నిర్వహిస్తారు.



ప్రభుత్వ ఆశయ సాధనలో వ్యవసాయాధికారుల కృషి ఎనలేనిది

నవతెలంగాణ-కోదాడరూరల్

ప్రభుత్వ ఆశయ సాధనలో వ్యవసాయ అధికారులకు ఎనలేనిదని ఎంపీపీ చింతా కవిత రాధారెడ్డి అన్నారు.శనివారం మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో తెలంగాణ రైతుబంధు సమితి నూతన క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు.అనంతరం ఎంపీపీని సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఏడీఏ వాసు, మండల వ్యవసాయ అధికారి రజిని, ఏఈఓ ఝాన్సీ, సల్మా,చాంద్‌బీ,రైతుబంధు సమితి కో ఆర్డినేటర్లు, సభ్యులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొరపాట్లు సవరించాలి

నవతెలంగాణ-మద్దిరాల



జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీ, ప్రమోషన్ జాబి తాలో దొర్లిన పొరపాట్లను సవరించి నూతన జాబి తాలను పారదర్శకంగా ఉండే విధంగా రూపొందించాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బర్పటి క్రాంతికుమార్ జిల్లా విద్యాశాఖను శనివారం ఒక ప్రకటనలో కోరారు. బదిలీ,ప్రమోషన్లలో అనేక పొరపాట్లు ఉన్నాయన్నారు.దీంతో సీనియర్ టీచర్లకు బదిలీ,ప్రమోషన్లలో అన్యాయం వాటిల్లుతుందని పేర్కొన్నారు.ప్రకటన విడుదల చేసిన వారిలో సీనియర్ ఉపాధ్యాయులు ఎస్‌కె.సైదులు, ఎండి.సాహెబ్‌అలీ, ఇరుగుయాదగిరి, దామళ్ల వెంకన్న ఉన్నారు.

'మేరీమదర్'లో స్వపరిపాలన

నవతెలంగాణ-తుంగతుర్తి





మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని మేరీ మదర్ పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ విజ్జి అన్నారు.శనివారం స్వపరిపాలనా దినోత్సవ వేడుకలలో భాగంగా వివిధ పాత్రలను పోషించిన(విద్యాశాఖ మంత్రిగా) నికిత,విష్ణువర్ధన్ (ఎంపి),వరుణ్ రెడ్డి (ఎమ్మెల్యే),జెడ్పీ చైర్ పర్సన్ (సంజన) జిల్లా విద్యాశాఖ అధికారిగా (కావేరి), ఎంఈఓ (సాయి శివాని), ఎంపీడీవో (వరుణ్ సాయి), తాసిల్దార్ (రమ్య),ఎంపీపీ (స్నిగ్ధ)లచే అంబేద్కర్,మహాత్మా జ్యోతిబాపూలే, జాతిపిత మహాత్మాగాంధీ,తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు.ఈ మేరకు దేశాన్ని ఒకే తాటిపై నడిపించే రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్‌అంబేద్కర్‌ను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. మహాత్మాగాంధీ, మహాత్మా జ్యోతిబాపూలే ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని సూచించారు.అనంతరం రోడ్డుపై టపాసులు కాలుస్తూ ర్యాలీ నిర్వహించారు. మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను, గిరిజన సంక్షేమ పాఠశాలను అధికారుల హోదాలో సందర్శించారు.ఈ వేడుకల్లో భాగంగా మేరీ మదర్ పాఠశాల విద్యార్థులను ఆహ్వానించిన కస్తూర్బా పాఠశాల ఎస్ఓ నాగలక్ష్మి, గిరిజన సంక్షేమగురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గాభవానిలకు ప్రిన్సిపాల్ మేరీ విజ్జి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దేవాలయానికి వాటర్‌ట్యాంక్ బహూకరణ

కోదాడరూరల్ :మండలపరిధిలోని యర్రవరం గ్రామంలో దూళ్ళగుట్ట స్వయంయుక్తగా వెలిసిన బాలా ఉగ్రనారసింహాస్వామి వారి ఆలయానికి 500 లీటర్ల వాటర్‌ట్యాంక్‌ను ఆలయ కమిటీ సభ్యులకు వనపర్తి సేవా దళం ట్రస్ట్ చైర్మెన్ వనపర్తి లక్ష్మీనారాయణ శనివారం అందించారు.ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం వేలమంది భక్తులు దైవదర్శనం కోసం వస్తుంటారని, ఇక్కడ అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.మంచినీటి దాహార్తి కోసం వనపర్తి సేవాదళం మంచినీటి ట్యాంక్ ఇవ్వడం చాలా సంతోషకరంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి సేవాదళ్ సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేశ సమైక్యత,సమగ్రత కోసమే రాహుల్‌గాంధీ జోడోయాత్ర

ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

దేశ సమైక్యత దేశసమగ్రత కోసమే రాహుల్‌గాంధీ జోడోయాత్ర చేపట్టారని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశ సమగ్రత సమైక్యత కోసమే కులాలకు మతాలకు రాజకీయాలకు అతీతంగా రాహుల్ గాంధీ భారత్ జోడు యాత్ర నిర్వహించారని తెలిపారు ఎటువంటి స్వార్ధ ప్రయోజనం లేకుండా ఈ యాత్ర జరిగిందన్నారు కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాష్టంలో కెసిఆర్ ప్రభుత్వం దేశ రాష్ట్ర అభివృద్ధిని నాశనం చేస్తున్నాయన్నారు.మోడీ ప్రభుత్వం పరిపాలనలో ధరలు విపరీతంగా పెరిగాయని,నిరుద్యోగం పెరిగిందన్నారు.కార్మికుల చట్టాలు నాశనం చేసి జాతీయ సంపదను కొందరికే దోచిపెట్టాలని చూసిందన్నారు.తాను 30 ఏండ్ల రాజకీయ జీవితంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా మంత్రిగా పనిచేసినప్పటికీ ఎటువంటి స్వార్ధ రాజకీయాలకు అవినీతికిపాల్పడలేదన్నారు.నేడు రాజకీయాలు వ్యాపారంగా మారాయన్నారు.హుజూర్‌నగర్ నియోజకవర్గంలో దోపిడీ దొంగల పరిపాలన సాగుతుందని, స్థానిక ఎమ్మెల్యే కమీషన్లకు కక్కుర్తి పడి అభివృద్ధికి ఆటంకంగా మారా డన్నారు.ఎమ్మెల్యే తన ఇష్టానుసారం మర్యాదలేకుండా మాట్లాడు తున్నాడని ఆయనకు బుద్ధి చెప్పడానికే తాను హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నానన్నారు.50 వేల మెజార్టీతో తాను గెలుస్తానని చెప్పారు.హుజూర్‌నగర్ నియో జకవర్గ ప్రజలన్ని గమనిస్తున్నారని సరైన సమయంలో సరైన తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.గతంలో పనిచేసిన ఏ ఎమ్మెల్యేలు కూడా చేయని అవినీతి ప్రస్తుత ఎమ్మెల్యే చేస్తున్నాడని ఆరోపి ంచారు.గ్రామపంచాయతీ పరిధిలో ఎల్ఈడీ లైట్లు కొనుగోలు నుండి ట్రాక్టర్ల కొనుగోలు వరకు అదేవిధంగా ప్రతి పనికి పర్సంటేజ్ తీసుకుంటూ అధికార దుర్వినియోగం చేస్తున్నాడని ఆరోపించారు. భూ కబ్జాలకు పాల్పడుతున్నాడని, రెవెన్యూపోలీస్‌అధికారులను తమకు తొత్తులుగా వాడు కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.నియోజకవర్గ పరిధిలో కొత్త లిఫ్టుల మంజూరు తర్వాత గాని, పాత లిఫ్టులను మరమ్మతు చేసే పరిస్థితుల్లో స్థానిక ఎమ్మెల్యే లేడని ఆరోపించారు.తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం ఏర్పాటుకు కృషి చేయడమే కాకుండా నియోజకవర్గంలో వంద పడకల ఏరియా హాస్పిటల్ రెవెన్యూ కార్యాలయ భవనం పోలీస్ స్టేషన్ మెయిన్‌రోడ్డు నిర్మాణం సెంట్రల్ లైటింగ్ ఆర్డీఓ కార్యాలయం ఈ విధంగా తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న



సమయంలో చేసిన అనేక పనులను ఆయన వివరించారు.ఈనెల 6వ తేదీ నుండి ప్రతి కాంగ్రెస్ కార్యకర్తా,ఎంపీపీలు,జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు గ్రామాల్లో హాత్ సే హాత్ జోడు కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబాన్ని కలవాలన్నారు.ఏఐసీసీ ఆదేశాల మేరకు ఈ కార్య క్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.నెల రోజుల్లో నియోజక వర్గపరిధిలో ప్రతి కుటుంబాన్ని కార్యకర్తలు కలవాలన్నారు.ఈ సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు అనురాధ,ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగని నాగన్నగౌడ్, సామల శివారెడ్డి, పార్టీ పట్టణ కార్యదర్శి తన్నీరు మల్లికార్జున్,మంజునాయక్, చెవిటి వెంకన్న, వి.సైదేశ్వరరావు, కీత రమేశ్, గోవింద్, జక్కుల మల్లయ్య సత్యనారాయణ పాల్గొన్నారు.



క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ - భువనగిరి

టీయూజేఎస్ క్యాలెండర్, డైరీని శయాద్రి జిల్లా కార్యవర్గ సభ్యులు శనివారం డీఈఓ. . కె. నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ సోమ్లు నాయక్, ప్రధాన కార్యదర్శి జిల్లా గౌరవాధ్యక్షులు కె. రవీందర్ నాయక్ , ముఖ్య సలహాదారులు పాండు నాయక, జిల్లా ట్రెజరర్ అప్పయ్య నాయక్, ఉపాధ్యక్షులు డాక్టర్ సేవ నాయక్ పాల్గొన్నారు.



బియ్యం పంపిణీ

నవతెలంగాణ -ఆలేరుటౌన్

మండల కేంద్రంలోని 10,11 వార్డులలో ఇటీవల మరణించిన దెయ్యాల. బుచ్చమ్మ. ముత్యాల అండాలు, ముక్కిడి శ్రీనివాస్ కుటుంబాలను శనివారం బీర్ల ఫౌండేషన్ చైర్మెన్, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ బీర్ల ఐలయ్య పరామర్శించారు. 50కిలోల చొప్పున బియ్యం పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో. టౌన్ అధ్యక్షుడు ఎం ఏ ఎజాస్, సింగిల్ విండో డైరెక్టర్ కట్టేగోముల సాగర్ రెడ్డి, ఎక్స్ ఎంపిటిసి ఎండి జానుద్దీన్, మల్లెల శ్రీకాంత్,ఎండి బాబా, ఆంజనేయులు, ఎండి మక్సుద్, రాపోలు విక్రమ్, నాగరాజ్. ఎండి జావీద్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొలుపుల వివేకానంద

నవతెలంగాణ-భువనగిరి

సమాజానికి మూలస్తంభాల్లో ఒకటైన పత్రికా మీడియా జర్నలిస్టుల పై దాడులు చేయడం హేయమైన చర్యని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొలుపుల వివేకానంద అన్నారు. శనివారం భువనగిరి డీసీపీ క్యాంపు కార్యాలయంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీసీపీ రాజేష్ చంద్రకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ జర్నలిస్టుల పై ఈ మధ్య కాలంలో దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తంచేశారు. సమాజ హితం కోరే జర్నలిస్టులపై ప్రజాప్రతినిధులు కొందరి అసమర్ధతను అద్దం పడితే కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం బాధాకరమన్నారు. మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త తన అనుచరులతో నవ తెలంగాణ విలేకరి ఇంటిపై,కుటుంబ సభ్యులపై దాడి చేయించడం సరైన పద్ధతి కాదని అన్నారు. తక్షణమే ఈ దాడిపై సమగ్ర విచారణ జరిపాలని కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పేరబోయిన నర్సింహులు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని అన్నారు.అధికార పార్టీకి చెందిన నేతలు విలేకరులపై దాడులకు పాల్పడటం వారికి స్థానిక పోలీసులు వత్తాసు పలకడం జరుగుతున్నదని విమర్శించారు. మోత్కూరులో దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తాని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు పుప్పాల మట్టయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల జలంధర్, సీనియర్ జర్నలిస్టులు ఎస్‌కే.ఉస్మాన్ షరీఫ్, కోడారి వెంకటేష్, ఎల్లంల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రావుల రాజు, నిమ్మల సురేష్ గౌడ్, ఎండీ ఇస్థియాక్ పూజ నర్సింహ, పాల రాజు పాల్గొన్నారు.



భువనగిరి

రామన్నపేట : మోత్కూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్తపై వార్తా కథనం రాసాడని మోత్కూరు మండల నవతెలంగాణ విలేకరి యాదగిరిపై దాడి చేసిన వారిపై, తప్పుడు కేసు ఎత్తివేసి, అతని ఇంటిపై దాడికి ప్రేరేపించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రెస్ క్లబ్ ఆఫ్ రామన్నపేట అధ్యక్షులు ఏటెల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రెస్ క్లబ్ ఆఫ్ రామన్నపేట ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసిల్దార్, సిఐ, ఎస్ఐ లకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 1న మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త వర్సెస్ కౌన్సిలర్స్ అనే వార్తా కథనం నవ తెలంగాణ పత్రికలో రావడంతో కక్షసాధింపు చర్యగా యాదగిరిపై, ఆయనఇంటిపై నలుగురు వ్యక్తులు దాడి చేసి అతనిపై హత్యాయత్నానికి పాల్పడడం సరిది కాదన్నారు. జర్నలిస్టు యాదగిరికి, కుటుంబానికి న్యాయం చేకూర్చి, భద్రత కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ప్రెస్ క్లబ్ ఆఫ్ రామన్నపేట ఉపాధ్యక్షులు ఎండి తక్కియోద్దిన్, ప్రధాన కార్యదర్శి బూరుగు వెంకటేశం, సహాయ కార్యదర్శి శివరాత్రి రమేష్, కోశాధికారి బోయపల్లి యాదయ్య, కార్యవర్గ సభ్యులు బైరబోయిన రమేష్, కనతాల శశిధర్ రెడ్డి, ఎండి గౌస్, అప్పం చెన్నకేశవ, హర్షద్ బెగ్ ఉన్నారు.



రామన్నపేట

గుందాల: యాదాద్రి జిల్లా మోత్కూర్ మండల నవ తెలంగాణ జర్నలిస్టు అవిశెట్టి యాదగిరి పై దాడిచేసిన వ్యక్తులను, అందుకు కారకులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు మంగళపల్లి హుస్సేన్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన రిపోర్టర్ యాదగిరిని ఫోన్ లో పరామర్శించి దాడికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక మున్సిపల్ చైర్మన్ భర్త మేఘారెడ్డి పై పొలిటికల్ వార్త రాశాడన్న కోపంతో అతని అనుచరులు యాదగిరి ఇంటి పై దాడి చేసి రిపోర్టర్ ను కొట్టడంతో పాటు భార్య, తల్లి పట్ల అనుచితంగా ప్రవర్తించడం హేయమైన చర్య అని ఖండించారు.జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై సీఎం కేసీఆర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఆర్డీఓ కార్యాలయం ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-చౌటుప్పల్

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న నాలుగువేల కోట్ల రూపాయల స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్ మెంట్ తక్షణమే విడుదలచేయాలని, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్‌చేస్తూ శనివారం చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని జాతీయ రహదారిపై ఎస్ఎఫ్ఐ మండలకమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లె శివకుమార్, మండల అధ్యక్షులు రాజుపెరియర్ మాట్లాడారు. రెండు సంవత్సరాలుగా స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదలచేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కళాశాలల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదలచేయకపోతే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల ఉపాధ్యక్షులు తీగుళ్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి ప్రకాశ్, సాతిరి మనోజ్, సహాయకార్యదర్శి విఘ్నేశ్, నాయకులు శ్రావణ్, సాగర్, వెంకట్, సుర్జీత్, సాయికిరణ్, పృథ్వీరాజ్, సందీప్, ప్రవళిక, గీత, అఖిల, పూజ పాల్గొన్నారు.



చౌటుప్పల్

వలిగొండ : విద్య రంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు, ఫీజురీయింబర్‌సమెంట్ విడుదల చేయాలని, రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30 నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ గణేష్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వేముల నాగరాజు సంఘం నాయకులు పి అజయ్ మధు సుమంత్ గణేష్ ఉదయ్ అనిత రెడ్డి అరుణ్ శంకర్ తదితరులు పాల్గొనాను.



వలిగొండ

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే కుట్ర

నవతెలంగాణ- ఆలేరురూరల్



వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని అఖిల భారత రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడాల బిక్షపతి ఆరోపించారు. శనివారం ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో ఆ సంఘం జిల్లా ముఖ్య సమావేశం కళ్లెపు అడివెయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ మూడు నెలల చట్టాలను వెనక్కి తీసుకుంటామని చెప్పి నేడు తిరిగి అమలు జరపడానికి ప్రయత్నిస్తున్నారన్నారు .విద్యుత్ చార్జీలను ఎసిడి పేరుతో అధికవసులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కళ్లెపు అడవయ్య, నాయకులు మామిడాల సోమయ్య ఇక్కిరి సహదేవ్, మామిడాల బాల మల్లేశం ,మధుసూదన్ రెడ్డి, అంజిరెడ్డి ,కళ్లెపు శంకర్ ,బొమ్మ కంటి శీను ,కోలాసోములు ,పైసా రాందాస్, నేరేడు స్వామి ,గడ్డం నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

8,9 తేదీల్లో హలోబీసీ చలో ఢిల్లీ

నవతెలంగాణ -భువనగిరిరూరల్

బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో ఈనెల 8, 9 తేదీన జంతర్ మంతర్ వద్ద ధర్నా పార్లమెంటు ముట్టడిని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మోది రాందేవ్ కోరారు. శనివారం స్థానికంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దేశ 45 లక్షల కోట్ల బడ్జెట్లో బిచ్చం వేసినట్లు బీసీలకు 2000 కోట్ల ఈ బడ్జెట్ బీసీల ఆత్మ గౌరవం దెబ్బతీసింది విద్యారంగాన్ని నీరుగాయించారు కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో 11 లక్షల కోట్లు వడ్డీలకే ఇక ఇవన్నీ కాదు మా డిమాండ్ నెరవేర్చడం కోసమే చలో ఢిల్లీ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో భూక్య బాలాజీ నాయక్, శిరీష గౌడ్, మందాన, ఉమామహేశ్వరి, మీనాక్షి, ప్రియాంక రెడ్డి, విమల, రమాదేవి, ఉదయ్‌శ్రీ, వసుంధర, కార్తిక పాల్గొన్నారు.



కస్తూర్బా బాలికల విద్యాలయాలకు కస్తూరి ఫౌండేషన్ చేయూత

నవతెలంగాణ-చౌటుప్పల్

కస్తూర్బా బాలికల విద్యాలయాలకు కస్తూరి ఫౌండేషన్ చేయూతనిస్తుందని కస్తూరి ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీచరణ్ అన్నారు. శనివారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి నాలుగు లక్షల 25వేల రూపాయలతో భవన మరమ్మత్తులు, విద్యార్థినులకు సానిటరీ కిట్స్, నోట్ బుక్స్, స్టేషనరీ సామాగ్రి, జ్యూట్ బ్యాగులు, గ్రామర్ బుక్స్, డిక్షనరీలు, స్పోర్ట్స్ మెటీరియల్, ఇంటర్ విద్యార్థినులకు ఆల్ ఇన్ వన్ తదితర వస్తువులు అందజేశారు. అంతకుముందు సరస్వతి చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. విద్యార్థినులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తేవాలని కోరారు. ప్రభుత్వం కస్తూర్బా విద్యాలయానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ భవానీ, సాగర్ల లింగయ్య, రమేశ్, శ్రావణ్, రామకృష్ణ, మహేశ్, నరేందర్‌రెడ్డి, జహంగీర్, వీరమల్ల కార్తీక్, శ్రీసాయి, శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనాథ బాలికలకు కస్తూరి చరణ్ అండ

నవతెలంగాణ -సంస్థాన్‌నారాయణపురం

మండలంలోని సర్వేలు గ్రామానికి చెందిన తేజ, కృష్ణవేణిల తల్లిదండ్రులు అనారోగ్యంతో చనిపోయారు. చదుకుకోవాలనే తపన ఉన్నా ఆర్థిక స్థోమత లేక పోవడంతో కూలీపనులకు వెళ్తున్నారు. ఈ చిన్నారుల ఆర్థిక పరిస్థితి తెలుసుకొని చలించిన కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ శనివారం రూ. 20వేల ఆర్థిక సహాయం అందజేశారు.చిన్నమ్మాయి కృష్ణవేణి చదువు బాధ్యత పూర్తిగా తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు.భవిష్యత్తులో ఈ నిరుపేద కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.ఈయన వెంట గ్రామ సర్పంచ్ కట్టెల బిక్షపతి,యువకులుశ్రీ గుండె మల్లేష్, ,కట్కూరి లక్ష్మణ్,వీరమళ్ళ భాస్కర్,ఫౌండేషన్ సభ్యులు మహేష్, రామకృష్ణ,నరేందర్ రెడ్డి,నవీన్ రెడ్డి,జహాంగీర్,వీరమళ్ల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ కుటుంబానికి అండగా ఉంటా

- డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి

నవతెలంగాణ -ఆలేరుటౌన్

చేనేత కార్మికుడు సత్యనారాయణ కుటుంబానికి అన్ని విధాలాగా అండగా ఉంటానని టెస్కాబ్ రాష్ట్ర వైస్ చైర్మెన్, ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీచైర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చేనేత కార్మికుడు కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. చేనేత భీమా ద్వారా మంజూరైన రూ.5 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్మన్ వస్పరి శంకరయ్య, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేశం, ఆడెపు బాలస్వామి ,దాసి సంతోష్,పాషికంటి శ్రీనివాసు, బింగి శ్రీనివాసు, బెతి శ్రీనివాసు, కృష్ణమూర్తి,చేనేత కార్మికులు పాల్గొన్నారు.



కాలువ పూడికతీత పనులపరిశీలన

నవతెలంగాణ -వలిగొండ రూరల్

భీమ లింగం కాలువ పూడిక తీత పనులు 15 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా సింగిల్‌విండో చైర్మెన్ సురకంటి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎమ్మె లింగస్వామి శనివారం పరిశీలించారు. 20 రోజుల క్రితం ఈ కాలువ దిగువ ప్రాంత రైతులు సాగునీరు రాకపోవడంతో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని కలిసి కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్క ఆకును తొలగించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రెండు హిటాచిలను తన సొంత డబ్బులతో సమకూర్చి పనులు చేయించారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఆఇటి పాముల రవీందర్, సర్పంచ్ లు సోలిపురం సాగర్ రెడ్డి బొడ్డుపల్లి ఉమా కృష్ణ, గుడిసే రాజేశ్వరి నరసింహ, ఎంపీటీసీ మోటే నరసింహ, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు గూడూరు శేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీరాములు నాగరాజు, ఎమ్మె లక్ష్మయ్య బీసీ సెల్ అధ్యక్షులు ఐటిపాముల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థినులకు అవగాహన

నవతెలంగాణ-అడ్డగుడూర్

మండల పరిధిలోని కాంచనపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 8,9 తరగతి ద్యార్థినులకు బాలిక అవకాశాలు, హక్కులు,సాధికారత కార్యక్రమం 10 రోజుల పాటు నిర్వహించారు. శనివారం చివరి రోజుగా పది రోజుల పాటు వారు నేర్చుకున్న అంశాలు నాటికలు,నృత్య ప్రదర్శనలు,ఉపన్యాసాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య ,జెడ్పిటిసి శ్రీ రాముల జ్యోతి అయోధ్య , ఎంపీడీఓ చంద్ర మౌళి ,తదితరులు పాల్గొన్నారు

మహిళా సాధికారతపై అవగాహన

నవతెలంగాణ -భువనగిరిరూరల్

మహిళా సాధికారతపై అవగాహనా సదస్సును శనివారంస్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నారాల నిర్మల వెంకటస్వామి యాదవ్ మహిళల హక్కులు, రక్షణ, సాధికారతపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుబ్బూరు బీరు మల్లయ్య, ఎంపీడీవో గుత్తా నరేందర్ రెడ్డి, ఎంపీఓ అనురాధా దేవి, ఎంపీటీసీలు, సర్పంచులు, అంగన్వాడి సూపర్వైజర్లు పాల్గొన్నారు.



బాలికలపై వేధింపులను, దాడులను అరికట్టాలి



నవతెలంగాణ -తుర్కపల్లి

గ్రామం నుండి పట్టణం దాకా అన్నిచోట్ల బాలికలపై జరుగుతున్న వేధింపులు, దాడులను అరికట్టే బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ఎంపీపీ భూక్య సుశీల రవీందర్ నాయక్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండవ విడత స్నేహిత కార్యక్రమం పై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ వివక్ష లేకుండా పిల్లలను తల్లిదండ్రులు పెంచాలని, బాల కార్మికులు లేకుండా చూడాలని, బాల్య వివాహాలను అరికట్టాలని, బాలల అక్రమ రవాణా, శారీరక, మానసిక వేధింపులు, బాలలతో భిక్షాటన, బాలికల పట్ల వివక్ష, బాలికల పట్ల లైంగిక వేధింపులు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల స్పెషల్ ఆఫీసర్ జినుకల శ్యాంసుందర్ ,ఎంపీడీవో మానే ఉమాదేవి ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుధీర్ రెడ్డి, ఎంపీ ఓ వెంకటేశ్వర్లు ,ఎంపీటీసీలు పలుగుల నవీన్ కుమార్, మోహన్ బాబు, సిహెచ్ఓ రాజయ్య, అంగన్వాడి సూపర్వైజర్ విజయ రాణి,పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అభివృద్ధిలో విద్యార్థులు పాలుపంచుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ - భువనగిరి

సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో విద్యార్థులు పాలుపంచుకునేలా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం రామన్నపేట జూనియర్ కళాశాల విద్యార్థినులు కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ వృత్తి విద్యాకోర్సు ద్వారా తయారు చేసిన 30 డ్రెస్సులను భువనగిరి పట్టణం తారకరామనగర్‌లోని రెండు అంగన్వాడీ సెంటర్ల చిన్నారులకు కలెక్టర్ అందజేసి మాట్లాడారు. రామన్నపేట జూనియర్ కాలేజీ విద్యార్థినులను అభినందించారు. కష్టపడి చదవాలని, ఇష్టమైన సబ్జెక్టులలో, వృత్తి విద్యాకోర్సులలో అభివృద్ధి సాధించాలని అన్నారు. సామాజిక కార్యక్రమాలలో ప్రభుత్వ శాఖలు సమన్వయం చేసుకొని పరస్పర సహకారం అందించుకోవాలని, విద్యార్థులను సామాజిక కార్యక్రమాలలో పాలుపంచుకునేలా చేయాలని, వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి, ప్రిన్సిపాల్స్ చంద్రకళ, పాపిరెడ్డి, సిడిపిఓ స్వరాజ్యం సూపర్వైజరు పద్మ, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కాన్ఫరెన్స్ హాలులో తన అధ్యక్షతన జరిగిన డిస్ట్రిక్ లెవెల్ సాండ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ఉదయం 6.00 నుండి సాయంత్రం 6:00 గంటల వరకు మాత్రమే రవాణా జరిగేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక అనుమతులు, రవాణా తీరు పట్ల ప్రతి 15 రోజులకు ఒకసారి విజిలెన్స్ పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఖనిజ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరమణ, జిల్లా రవాణా అధికారి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రౌండ్ వాటర్ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతి కుమార్, జిల్లా పంచాయతీ అధికారి సునంద, జిల్లా నీటిపారుదల అధికారి నరసింహులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మణ్, టీఎస్ఎండిసి ప్రాజెక్టు డైరెక్టర్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్టు

నవతెలంగాణ- ఆలేరుటౌన్

విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రగతి ముట్టడికి వెళ్లకుండా శనివారం ఎస్ఐ ఎండి ఇద్రిస్ అలీ ,ఏఎస్ఐ కట్టమోహన్ రెడ్డి డీవైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తీసుకెళ్లారు. అరెస్టు అయిన వారిలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎలుగల శివ ,చేన్న రాజేష్ , కాసుల నరేష్ ఉన్నారు.

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి అరెస్ట్

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ పిలుపు మేరకే ప్రగతి భవన్ ముట్టడి వెళ్లకుండా సీపీఐఎంఎల్ న్యూడెమో డివిజన్ కార్యదర్శి బేజాడి కుమార్‌ను అరెస్టు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్బంధించిన ప్రజాస్వామిక వాదులను వెంటనే విడుదల చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్దన్ కోరారు.



'ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకునేది లేదు'

నవతెలంగాణ -బొమ్మలరామరం

ఆలేరు ఎమ్మెల్యేచ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతను విమర్శిస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ మండల మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు తొంట సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని మునిరాబాద్ గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కావాలని కొంతమంది ఎమ్మెల్యే సునీత పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తమ రాజకీయ స్వలాభం కోసం ప్రజలను మభ్యపెడుతూ మాయమాటలు చెబుతూ ముందుకు సాగుతున్నారని మండిపడ్డారు. టీపీసీసీ అధికార ప్రతినిధి బీర్ల ఐలయ్య చేసిన వ్యాఖ్యలను తిప్పి కొట్టారు. తమ గ్రామానికి ఎమ్మెల్యే సునీత మహేందర్ రెడ్డి కృషితో దళిత బంధు అందిందని. ఇవే కాకుండా ఎన్నో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేసేందుకు కృషి చేస్తున్న ఘనత ప్రభుత్వ విప్ సునీత మహేందర్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. కమిషన్ల కోసమే దళిత బంధు అందించారని మాట్లాడడం సరికాదన్నారు. బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీపతి బాలయ్య. గ్రామ శాఖ ఎస్సీ అధ్యక్షుడు జోగు నరసింహులు .జోగు దానయ్య తొంట శంకరయ్య. శ్రీపతి ముత్యాలు. బంగారు కాసిం. బులికి రామయ్య .శ్రీపతి రాజు, బులికి నవీన్, తొంట మహేష్, తొంట ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



గీత కార్మికునికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ -ఆలేరురూరల్

తాటిచెట్టుపై నుండి గీత కార్మికునికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం ఆలేరు మండలం టంగుటూరు గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. టంగుటూరు గ్రామానికి చెందిన దూసరి శ్రీనివాస్ రోజు లాగానే శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో కల్లు గీయడానికి తాటిచెట్టు సగం వరకు ఎక్కాడు. కాలుజారి కింద పడటంతో శ్రీనివాస్ కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి గీత కార్మికులు ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



తెలంగాణ సంస్కృతిని చాటేలా ఎడ్లపందేలు

నవతెలంగాణ-కోదాడరూరల్

తెలంగాణ సంస్కృతిని చాటేలా కోదాడలో మొట్టమొదటిసారిగా ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సహకారంతో లింగమంతుల స్వామి జాతర సందర్భంగా ఎడ్లపందాలను నిర్వహించడం అభినందనీయమని పీఏసీఎస్ చైర్మెన్ ఆవుల రామారావు అన్నారు.శనివారం పట్టణంలో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయస్థాయి ఒంగోలు గిత్తల ఎడ్ల బండలాగుడు ప్రదర్శన మూడో రోజు పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. గతంలో జాతరలు, ఎడ్ల పోటీలను చూడాల్సి వస్తే నియోజక ప్రజలందరూ వ్యయ ప్రయాసలకు ఓర్చి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు.ప్రస్తుతం ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ చొరవతో లింగమంతుల స్వామి దేవాలయం పూర్తిచేసుకుని అంగరంగ వైభవంగా జాతర జరుపుకోవడం పట్ల ఇక్కడ ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.కాగా మూడో రోజు జరుగుతున్న పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.30 వేల నగదు ప్రోత్సాహకాన్ని విజేతలకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, యాదవ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు, ఆలయ కమిటీ సభ్యులు ఈదుల కృష్ణయ్యయాదవ్, కార్యదర్శి కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కసినిడి జయప్రకాష్, ఆలయ కమిటీ సభ్యులు మాదాల ఉపేందర్, గుండెల సూర్యనారాయణ,వేనేపల్లి శ్రీనివాసరావు, వెంపటి మధుసూదన్, సంగిశెట్టి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలపై ఉద్యమిద్దాం

నవతెలంగాణ-ఆత్మకూర్ఎస్

విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలపై ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరు సాగర్ పిలుపునిచ్చారు.శనివారం మండలంలోని బొప్పారం గ్రామంలో పీవైఎల్ మండల మహాసభను విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో యువతీ, యువ కులతో ర్యాలీ నిర్వహించారు.ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నల్లగొండ నాగయ్య బిగి పిడికిలి జెండాను ఆవిష్కరించారు.అనంతరం ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో దామర శ్రీను అధ్యక్షతన జరిగిన ఆ సంఘం మండల మహాసభలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు.రాష్ట్రంలో, దేశంలో నిరుద్యోగ సమస్య విలయతాండవం చేస్తుందన్నారు.ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, దీనికి పాలకులే ప్రధాన కారణమని దుయ్యబట్టారు.మరోవైపు వైద్యరంగంలో డాక్టర్స్,నర్సులు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దీనితో పేద,బడుగు,బలహీన వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించలేకపోతున్నారని ఆరోపించారు.మహాసభలో అరుణోదయ జిల్లా కార్యదర్శి కంచనపల్లి సైదులు, సహయ కార్యదర్శి ఎర్ర ఉమేష్,బొల్లె వెంకన్న పాడిన పాటలు సభికులను ఆకర్షించాయి.ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు,ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి అలుగువెల్లి వెంకటరెడ్డి ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం పి.వై.ఎల్ నాయకులు ఇరుగు సురేష్, పోతురాజు ప్రతాప్, కలంరెడ్డి శీను,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దేశోజ్ మధు,పగడాల సుధాకర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్లు పారదర్శకంగా నిర్వర్తించాలి

నవతెలంగాణ-తిరుమలగిరి

ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు పారదర్శకంగా నిర్వర్తించాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జి.ఆనందభాస్కర్ అన్నారు.శనివారం ఆ శాఖా సమావేశం గుడిపాటి నరేష్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని ఖాళీలన్నింటిని జాబితా లో నిష్పక్షపాతంగా చూపించాలన్నారు.జీఓ 317, జీ ఓ 610,అంతర్ జిల్లా బదిలీలలో సూర్యాపేట జిల్లాకు వచ్చిన వారి వివరాలను వెల్లడి చేసి వారిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం జాబితాలో స్థానం కేటాయించాలని కోరారు.క్లేర్ వేకెన్సీలను, లాంగ్ స్టాండింగ్ ఉపాధ్యాయుల వివరాలను పారదర్శకంగా కావాలని తప్పు సమాచారం అందించే వారిపై తప్పక చర్యలు తీసుకోవాలన్నారు.ఏ సంఘం కానీ, అధికారి గానీ, డీఈఓ కార్యాలయ ఉద్యోగులు కానీ, టెక్నీషియన్ వారుగాని, ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమాలకు అవ కాశం ఇవ్వకుండా బదిలీలు, ప్రమోషన్ లలో రాష్ట్ర స్థాయిలో పారదర్శకంగా జరిపించే విధంగా సూర్యాపేట జిల్లా నిలవాలని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్ర మంలో వెంకటేశ్వర్లు, ఆర్.ఉమారాణి, అజయ్‌కుమార్, కవిత, శ్రీలత పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

సూర్యాపేటకలెక్టరేట్ :జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ ఎకనామిక్, స్టాటిస్టికల్ సబ్-ఆర్డినేట్ అసోసియేషన్, సూర్యాపేట జిల్లా 2023 డైరీని శనివారం ముఖ్య ప్రణాళికా అధికారి గూడ వెంకటేశ్వర్లు, సహాయ సంచాలకులు ఎల్.కిషన్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఆత్మగౌరవం పెంచే విధంగా డైరీ ఉంటాయని, ఉద్యోగులందరూ డైరీని చేతబూని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టె ప్రభుత్వ పథకాలను సక్రమంగా ప్రజలకు అందే విధంగా చూడాలని తెలిపారు.టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్ మాట్లాడుతూ ఉద్యోగులంతా వారి ఉద్యోగ జీవితంలో ఉపయోగపడే ఎన్నో విషయాలు డైరీలో ఉంటాయన్నారు.భవిష్యత్‌లో చేయబోయే పనులను వాటిలో పొందు పరుచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గణాంక అధికారి వి. శ్రీని వాసరావు,టీఈఎస్ఎస్ఏ కోశాధికారి చిత్తలూరి అశోక్, వెంపటి రామారావు, బాదే లింగయ్య, రాజేష్, బాలాజీ, కోటేశ్వరరావు, శివలింగప్రసాద్, శ్రీనివాసరెడ్డి, లింగారావు, ఆర్.రాధ, కె.శ్రీను, రమేష్, మల్లూర్, సందీప్,నర్సింహారావు పాల్గొన్నారు.

పెద్దగట్టు జాతర చరిత్ర

● ఐదు రోజుల పాటు ఘనంగా జరగనున్న జాతర

నవతెలంగాణ-సూర్యాపేట





క్రీస్తుపూర్వం 500ఏండ్ల కింద చౌళ్య, చాళుక్యులు, యాదవ రాజులు,కాకతీయులు ఉండ్రుగొండ రాజధానిగా చేసుకొని పాలించేవారు.ఆ కాలంలో ఉండ్రుగొండ గుట్ట మీద పెద్దగట్టులో శివాలయం, లక్ష్మీనర్సింహస్వామి, లింగమంతుల స్వామి, చౌడమ్మతల్లి, ఆంజనేయ స్వామి మొదలైన దేవాలయాలను కట్టించారని పెద్దలు చెబుతూ ఉంటారు.అదేవిధంగా ప్రతి సంవత్సరం మాఘమాసంలో లింగమంతుల, చౌడమ్మతల్లి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేవారు.జాతర సమయంలో నిండు గర్భిణీ లింగస్వామి మొక్కు చెల్లించి బోనం కుండ పూజా సామగ్రితో మంద గంపను ఎత్తుకొని పెద్దగట్టు ఎక్కుతుండగా కాలుజారి కింద పడి మృతి చెందినట్టు చరిత్ర చెబుతుంది.దీనికి చలించిన లింగమంతుల స్వామి భక్తుల సౌకర్యార్థం గొల్లగుట్టపై వెలిశారని నానుడి. కాలక్రమేణా కాకతీయుల రాజ్యం పతనం కావడంతో ఆ తర్వాత వచ్చిన నవాబులు ఉండ్రుగొండను పాలించారు.అదే సమయంలో కొంతమంది దుండగులు లింగమంతుల స్వామి, చౌడమ్మతల్లి విగ్రహాలను అపహరించి బావిలో పడేసినట్టు ప్రచారం నెలకొంది.కొంతకాలం తర్వాత కేసారం గ్రామానికి చెందిన యాదవులు,రెడ్డి వారు గొర్రె, ఆవులను మేపుతూ పెద్దగట్టు వద్దకు వెళ్లారు.కరువు కాటకాలతో ఉన్న ఈ ప్రాంతంలో నీరు లేక వారి ఇబ్బందులు పడుతుండగా గొర్రెల కాపరులకు చద్దిమూట తెచ్చిన భార్యకు లింగమంతుల స్వామి నిండుకొని జీవాలు, గొర్రెల కాపరుల దాహం తీరాలంటే చూపించిన చోట బావి తవ్వాలని చెప్పడం, ఆమె మాట ప్రకారం బావి తవ్వుతుండగా లింగమంతుల స్వామి, చౌడమ్మతల్లి,శివ లింగాలు దొరకడం, విగ్రహాలు బయట పడే సమయంలో సింగం వచ్చి పూజలు చేయాలని చెప్పడంతో లింగమంతుల, చౌడమ్మతల్లి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నట్టుగా కథలుగా చెప్పుకుంటున్నారు.



మరొక కోణంలో ...

ఈ ప్రాంత వాసులు దురాజ్‌పల్లి జాతర గురించి రకరకాలుగా చెప్పులు చెప్పుకునే చరిత్ర ఇలా ఉంది.నాలుగు దశాబ్దాల కింద దురాజ్‌పల్లి ప్రాంతం దట్టమైన అభయారణ్యంలో ఉండేది.వల్లభాపురం, కాశీంపేట, ఉండ్రుగొండ, దురాజ్‌పల్లి ప్రాంతాలలో యాదవులు తమ గొర్రెల మందలను తెచ్చి ఈ ప్రాంతాలలో వారు మేపేవారు.ఈ ప్రాంతాలలో క్రూర మృగాలు కూడా అధిక సంఖ్యలో ఉండేవి. మేత కోసం వచ్చిన గొర్రెలు, మేకలను వందల సంఖ్యలో చంపి తినేవి. దీంతో యాదవులు దిక్కుతోచని స్థితిలో శివుడికి మొరపెట్టుకుంటారు.దీంతో శివుడు లింగమంతుల స్వామి గుర్రంపై త్రిశూల ధారియై ఈ ప్రాంతంలో సంచరిస్తూ క్రూరమృగాలను వధించసాగాడు.క్రూరమృగాలను వధించిన రాక్షస అనుగ్రహంతో అవి వాటి రక్తపు చుక్కలు భూమిపై పడుతుండడంతో మళ్లీ బతుకుతుండడంతో లింగమంతుల స్వామి సోదరి చౌడమ్మ ఆ స్థలంలో రాక్షస మాయ కలిగిన మృగాల రక్తపు చుక్కలు కింద పడకుండా నాలుకను చాపింది.దీంతో క్రూర మృగాల రక్తం నేలపై పడకుండా ఆమె నాకడంతో మృగాలన్నీ మృతి చెందాయి.అప్పటినుండి యాదవులు కృతజ్ఞతగా శివుడికి పిల్ల తల్లి గొర్రెను బలివ చూపారు. దానికి శివుడు తాను శాఖాహారినని తన సోదరి చౌడమ్మకు బలివ్వమనడంతో వారు మొక్కులు చెల్లించుకున్నారు.అప్పుడు యాదవులు శివున్ని తమతో ఉండాలని వేడుకోవడంతో ఇక్కడ వెలిశాడని ప్రతీతి.

ఇంకొక కథనం...

పూర్వం పెద్దగట్టు సమీపంలో గల కేసారం గ్రామానికి చెందిన గొర్ల లింగారెడ్డి మరికొందరు గొర్రెలకాపర్లుగా అక్కడికి చేరుకున్నారు.గొర్రెలు మేస్తుండగా గొర్ల లింగారెడ్డి చెట్టు కింద నిద్రకు ఉపక్రమించాడు.నిద్రలో లింగారెడ్డికి శివుడు ప్రత్యక్షమై తాను మర్రిచెట్టు సమీపంలో గల బావిలో పుడకపోయానని తనను వెలికితీయాలని, తీసి ప్రతిష్ఠ చేయాలని చెప్పి మాయమయ్యాడని పెద్దలు చెబుతూ ఉండేవారు. దీంతో అతను ఇరుగు పొరుగు వారికి విషయం చెప్పి మరుసటి రోజు బాగా బావిలో వెతకగా గుర్రంపై భారీగా త్రిశూల దారిగా ఉన్నా శివుడి విగ్రహం బయటపడింది. దీంతో ఆ విగ్రహాన్ని వెలికి తీసి పెద్ద గట్టుపై ప్రతిష్ఠించి జాతర జరుపుతున్నారు.ఇప్పటికే కేసారం గొర్ల వంశీయులు దేవుడికి గొర్రెలను బలివ్వడం దేవరపెట్టెకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది.ఈ రకంగా పెద్దగట్టు జాతర చరిత్ర కథలుకథలుగా చెప్పుకుంటున్నప్పటికీ ప్రతి రెండేండ్లకోసారి వచ్చే పెద్దగట్టు జాతరను ఐదు రోజుల పాటు యాదవ కులస్తులు ఘనంగా జరుపుకుంటారు.

మోడల్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-గరిడేపల్లి

మండలపరిధిలోని గడ్డిపల్లి గ్రామంలోని మోడల్‌స్కూల్‌లో 2023-24 సంవత్సరానికి 6 నుంచి 10వ తరగతి అడ్మిషన్ల కోసం ఈనెల 15 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని గడ్డిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఐ.సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.మోడల్ స్కూల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లీష్ మీడియంలో ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నామని పేర్కొన్నారు.స్కూల్‌లో అధునాతన సైన్స్, మాథ్స్ ల్యాబ్‌లు ఉన్నా యన్నారు.విద్యార్థులకు డిజిటల్ క్లాసులు కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు.విద్యార్థులు క్రీడావికాసం కోసం పెద్ద క్రీడాప్రాంగణం, మినరల్ వాటర్‌ప్లాంట్ సౌకర్యం కూడా ఉందని తెలిపారు.గడ్డిపల్లి మోడల్‌స్కూల్‌లో అగ్రికల్చర్ మల్టీమీడియా కోర్సులు కూడా ఉన్నాయని, ప్రతి సంవత్సరం బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధిస్తున్నామని తెలిపారు. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడలు, పోటీ పరీక్షల్లో విద్యార్థులు ఎక్కువగా రాణిస్తున్నారని, కావున ఈ అవకాశాన్ని విద్యార్థులు అందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

ఉచిత విద్య, వైద్యం అందజేస్తాం

నవతెలంగాణ-చివ్వెంల



బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత వైద్యం కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తామని మాట ఇచ్చి మాట తప్పిన ప్రభుత్వమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు.శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండలసమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులను నట్టేటా ముంచిందన్నారు. రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళితుల్ని ముఖ్యమంత్రి చేస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చిన సీఎంకేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేశారని ఎద్దేవా చేశారు.రానున్న రోజుల్లో బీజేపీకి ప్రజలు బ్రహ్మరథం పట్టి అధికారంలోకి తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, ధరావత్ శ్రీనివాస్‌నాయక్, కొనతం అప్పిరెడ్డి, మండల ప్రధానకార్యదర్శులు జంపాల వెంకటేశ్వర్లు,బిట్టు నాగరాజు, వీరస్వామి, రాజశేఖర్, అనిల్, వీరన్ననాయక్, అశోక్, జానిపాషా, పఠాన్‌పాషా, చిట్టిబాబు, కనకయ్య పాల్గొన్నారు.

వాసిరెడ్డి సోమిరెడ్డికి ఘననివాళులు

నవతెలంగాణ-తిరుమలగిరి

మండలంలోని తొండ గ్రామంలో సీపీఐ మండల కార్యదర్శి వాసిరెడ్డి సోమిరెడ్డి శుక్రవారం గుండెపోటుతో మరణించారు. శనివారం స్థానిక చౌరస్తాలో సామాజిక తెలంగాణ ఆధ్వర్యంలో సోమిరెడ్డికి ఘన నివాళులర్పించారు.మాజీ ఎంపీపీ, కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు.సోమిరెడ్డి చిన్నతనం నుండి ఎర్రజెండాకు ఆకర్షితుడై అనేక ప్రజా పోరాటాలు నిర్వహించారన్నారు.కడవరకు ఎర్రజెండా పార్టీలోనే కొనసాగారన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లాల యాదగిరి పాల్గొన్నారు.

ఉచిత హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నల్లగొండ

ఉచిత హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు చిలుకూరి రామకృష్ణ తెలిపారు. శనివారం పట్టణంలోని రాజిరెడ్డి హాస్పిటల్ వద్ద ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ, లయన్స్ క్లబ్ నల్లగొండ ఐకాన్, ఆధ్వర్యంలో మలక్‌పేట యశోద హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్త్రీలకు వచ్చే గర్భకోశ క్యాన్సర్ వ్యాధి నివారణకు పాప్ స్మియర్, పురుషులలో ప్రొటెస్ట్ క్యాన్సర్ నివారణకు సంబంధించిన పీఎస్ఏ పరీక్షలు, బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన ఈసీజీ, టుడి ఈకో, పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో అహంకాలజిస్ట్ డాక్టర్ ఎల్.రోహిత్ రెడ్డి ఉచిత కన్సల్టెన్సీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యశోద ఆస్పత్రి డాక్టర్లు శివాని, వైష్ణవి, లైన్స్ క్లబ్ ఐకాన్ అధ్యక్షులు ఎస్‌కేఆర్.అన్సారి, ప్రధాన కార్యదర్శి గోపన గోని యాదగిరి, కోశాధికారి ఎర్ర మాద అశోక్ , డాక్టర్లు సిహెచ్ పుల్లారావు, ఎల్ రాజిరెడ్డి, లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ సతీష్ కుమార్, సభ్యులు ఎల్వి యాదవ్, వీరెల్లి సత్యనారాయణ, నిర్మల పిచ్చయ్య, సైదులు, మండడి శంకర్ రెడ్డి, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బహిరంగ సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-మర్రిగూడ

నేడు మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభను తెలంగాణ నుండి నాయకుల అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు చెరుకు లింగంగౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశం అభివృద్ధి సాధించాలంటే అది బీఆర్ఎస్ నాయకత్వంతోనే సాధ్యమని తెలిపారు.



కబడ్డీ మెగా టోర్నమెంట్

నవతెలంగాణ-మర్రిగూడ

మర్రిగూడ మండలంలోని అన్ని యూత్‌ల సహకారంతో శివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ చెన్నకేశవ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు యూత్ అధ్యక్షులు ఎం. ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం మర్రిగూడ మండల కేంద్రంలో సంబంధించిన కరపత్రాన్ని మర్రిగూడ ఉపసర్పంచ్ అలివేలు నరసింహ చేతుల మీదుగా విడుదల చేశారు. ఆసక్తి గల యువకులు పోటీలో పాల్గొని విజయవంతం చేయగలరని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలయ్య, మాల మహానాడు మండల అధ్యక్షులు మారయ్య, చైర్మెన్ యాదయ్య, పలు యూత్‌ల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అక్స్‌ఫర్డ్ స్కూల్‌లో స్వపరిపాలన

నవతెలంగాణ-చిట్యాలటౌన్

నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు చెందిన పలు విద్యార్థులు వివిధ రాజకీయ ప్రముఖులుగా, అధికారులుగా, ఉపాధ్యాయులుగా చక్కని అభినయాన్ని ప్రదర్శించారు. స్వపరిపాలన ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న సాధకబాధకాలను విద్యార్థులు స్వయంగా తెలుసుకోవడానికి స్వపరిపాలన దినోత్సవం ఒక వేదికని అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠాలను అర్థం చేసుకొని, చక్కని విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పెద్ది నరేందర్, డైరెక్టర్ బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, షమీమ్, ఎన్ ఆనంద్, యాదయ్య, జ్యోతి, జుబేద, స్వాతి, సుధారాణి, ధనలక్ష్మి, రమాదేవి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-పెద్దవూర

పెద్దవూర మండలం లో ఈ నెల 7వ తేదీ నుండి 9వ తేదీ వరకు జరగనున్న సుంకిశాల ముత్యాలమ్మ జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నాగార్జున సాగర్ సీఐ నాగరాజు నిర్వాహకులకు సూచించారు. శనివారం జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జాతరలో ఏర్పాటు చేస్తున్న షెడ్ నిర్మాణ పనులు పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జాతరకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు తగినట్లుగా చేయాలని పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పరమేష, నిర్వాహకులు రమావత్ మోహన్ నాయక్, పూజారి లచ్చిరామ్ నాయక్ ఉన్నారు.

తపాలాశాఖ పథకాలలో ప్రజలను భాగస్వామ్యం చేయాలి

నవతెలంగాణ-పెద్దవూర

భారత ప్రభుత్వ తపాలాశాఖ అందిస్తున్న అన్ని రకాల పథకాలను ప్రజలు అంది పుచ్చుకొనేలా చేసి ప్రజలను భాగస్వాములను చేయాలని పోస్ట్ ఆఫీస్ దేవరకొండ డివిజన్ సీనియర్ ఇన్స్‌పెక్టర్ మదన్ మోహన్ కోరారు. పోస్టాఫీస్ అందిస్తున్న పాలసీలు, పథకాలపై శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో తపాలా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ భవిష్యత్‌లో ఉపయోగపడే 'బేటీ బచావో-బేటీ పడావో', సుకన్య సమృద్ధి అకౌంట్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న తదితర పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

సర్వర్ వెరీ స్లో...

- ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో..
- వినియోగదారుల సేవా కేంద్రంలో తప్పని తిప్పలు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



బ్యాంకింగ్ సేవలను ప్రతి ఒక్కరికి అందుబాటులో తేవాలని గ్రామీణ ప్రాంతాల వారు బ్యాంకుకు వెళ్లి సేవలను వినియోగించుకోలేకపోతున్నారనే ఉద్దేశంతో ఆర్బీఐ వినియోగదారుల సేవా కేంద్రాలను గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులోకి తెచ్చింది. లక్ష్యం ఘనమైనప్పటికీ అమల్లోకి వచ్చేసరికి బ్యాంకు సర్వర్ చాలా స్లోగా కొనసాగుతుంది. వినియోగదారులు తమ ఖాతాలలో క్రయవిక్రయాలు జరిపేందుకు వినియోగదారుల సేవా కేంద్రానికి వెళ్తున్న క్రమంలో బ్యాంకు సర్వర్ వెరీ స్లోగా ఉండడంతో గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఉంది. వినియోగదారుల సేవా కేంద్రం నిర్వాహకులు ఒక్కొక్క వినియోగదారునికి ఒక్కొక్కసారి ఆ సైటును ఉపయోగించాల్సి వస్తుంది. ఒక వినియోగదారునికి ఉపయోగించిన తర్వాత అక్కడికి నిలిచిపోతుంది. దీంతో ఒక్కొక్క వినియోగదారుడికి 15 నిమిషాలపైగా సమయం తీసుకుంటుంది. వినియోగదారుల సేవా కేంద్రంలో వినియోగదారులు, నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు.

వినియోగదారుల సేవా కేంద్రంలో తప్పని తిప్పలు

వినియోగదారుల సేవా కేంద్రంలో ఆధార్ కార్డు ద్వారా ప్రతిరోజు 10 వేల రూపాయలు విత్ డ్రా చేసుకోవడం, సమ భావన సంఘాలకు సంబంధించిన రుణాలు చెల్లించుకోవడం, ఇతర ప్రాంతాలకు సులువుగా డబ్బులు పంపించమని సేవా కేంద్రాల్లో వినియోగదారులు సేవలు వినియోగించుకోవడానికి ఇష్టపడుతున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో, మండల కేంద్రంలో సైతం వినియోగదారులకు తిప్పలు తప్పడం లేదు.

బ్యాంకు సర్వర్ స్లోగా ఉంది

కనుక నరేష్ (వినియోగదారుల సేవా కేంద్రం ఏరియా మేనేజర్)

బ్యాంకు సర్వర్ స్లోగా ఉండడంతో వినియోగదారుల సేవా కేంద్రాల్లో వినియోగదారులకు తిప్పలు తప్పడం లేదని వినియోగదారుల సేవా కేంద్రం ఏరియా మేనేజర్ కనుక నరేష్ నవ తెలంగాణకు వివరణ ఇచ్చారు.

సారూ..! జర పట్టించుకోరూ..!

- రోడ్డుపై పారుతున్న మురుగునీరు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు

నవతెలంగాణ-నాగార్జునసాగర్



డ్రైనేజీ సమస్య కారణంగా మురుగునీరు రోడ్డుపై పారు తుండటంతో స్థానిక ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రజా ప్రతి నిధులకు, అధికారులకు పలుమార్లు సమస్యను వివరించినా పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నందికొండ మున్సిపాలిటీ పరిధి పైలాన్ కాలనీ 8వ వార్డులోని గాంధీ బజార్ ఎండీ టైపు కాలనిలో డ్రైనేజీ లీకేజీల కారణంగా మురుగునీరు నిత్యం రోడ్డుపై పారుతోంది. అదే కాలనిలో ప్రభుత్వ పాఠశాల ఉండటం పాఠశాల గుండా మురుగు నీరు ప్రవహిస్తుండటంతో నిత్యం విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర దుర్వాసనతో పాటు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానిక ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రజలకు నాణ్యమైన వస్త్రాలు అందించాలి

- మున్సిపల్ చైర్మెన్ మందడి సైదిరెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ



ప్రజలకు నాణ్యమైన వస్త్రాలు అందించాలని మున్సిపల్ చైర్మెన్ మందడి సైదిరెడ్డి నిర్వాహకులకు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రకాశం బజార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రైమాండ్, డీఎల్ఆర్ ఫ్యాషన్ షో రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం నిర్వాహకులు దూసరి రామస్వామి మాట్లాడుతూ షో రూమ్‌లో డైమండ్స్, ఎస్సీఎస్, అరవింద్, సియారామ్, లెనిన్ కాటన్, వస్త్రాలు శాసనమైన ధరలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 20శాతం తగ్గింపు ధరలతో వినియోగదారులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రైసా వసీం, మాజీ కౌన్సిలర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

బాలలకు స్వేచ్ఛ, వికాసం కల్పించాలి

- ఎస్పీ అపూర్వరావు

నవతెలంగాణ-నల్లగొండ

బాలలకు స్వేచ్ఛ, వికాసం కల్పించాలని జిల్లా ఎస్పీ కే.అపూర్వరావు అన్నారు. శనివారం పోలీస్ కార్యాలయంలో విలేకర్లతో ఎస్పీ మాట్లాడుతూ నిరాదరణకు గురైన, తప్పిపోయిన, వెట్టి చాకిరికి గురౌవుతున్న బాలబాలికలను గుర్తించి వారిని సంరక్షించడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. ఈ జనవరి 1వ తేదీ నుండి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా నెల రోజులుగా నిర్వహించిన ఆపరేషన్ స్మైల్-9 కార్యక్రమం ద్వారా 82 మంది బాలలను గుర్తించి 72 క్రిమినల్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా బాలల స్వేచ్ఛకు, వికాసానికి భంగం కలిగించిన, వెట్టి చాకిరీ చేయించినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెట్టి చాకిరికి గురవుతున్న పిల్లలను గుర్తించి పోలీస్ బరోసా సెంటర్, షీ టీమ్స్, డివిజన్ అధికారుల ద్వారా పిల్లలకు, తల్లిదండ్రులు, ఇండస్ట్రియల్ యజమానులకు కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు.





ఉద్దీపన ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా

నవతెలంగాణ-నకిరేకల్

ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో ఈ నెల 12న నకిరేకల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ప్రారంభించిన నాటి నుండి నేటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా మారిందన్నారు. అందులో భాగంగా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రభుత్వ పాఠశాలలో వాల్లంటీర్ల ద్వారా ఆంగ్ల విద్యను, కరోనా క్లిష్టమైన సమయంలో ప్రజలకు ఫౌండేషన్ ద్వారా అనేక సేవలు అందించామన్నారు. గత నెలలో తెలంగాణ ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలకు ఉద్దీపన ద్వారా సుమారు 3 నెలలు కోచింగ్ అందించినట్లు తెలిపారు. మెగా జాబ్ మేళాలో సుమారు 80 పైచిలుకు కంపెనీలు పాల్గొంటాయని, నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 12న ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 95157 38729, 99858 58091, 7287894394, 93980 69412 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పూజర్ల శంబయ, నాయకులు యానాల లింగారెడ్డి, గాదగోని కొండయ్య, పగడాల సైదులు తదితరులు పాల్గొన్నారు.



మార్వాడీల మోసాలను అరికట్టాలి

నవతెలంగాణ-చింతపల్లి

మార్వాడి మోసాలను అరికట్టాలని, నకిలీల పేరుతో మోసం చేస్తున్న మార్వాడి దుకాణాలను తీసివేసి మోసపోతున్న వారికి న్యాయం చేయాలని వికలాంగుల జిల్లా అధ్యక్షుడు జెల్లా నర్సింహగౌడ్ , బహుజన రాష్ట్ర నాయకులు కురుమేటి శ్రీను, జంతుక నరసింహ కోరారు. శనివారం చింతపల్లి మండలంలోని మాల్ కుర్మేడ్ గేట్ చింతపల్లి తదితర గ్రామాలలో పర్యటించి ప్రతి దగ్గర చిన్న పెద్ద ఊరు తేడా తెలియకుండా మార్వాడి రాజస్థానీయులు తిష్ట వేసి వ్యాపారం మీద దెబ్బ పడే విధంగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేధావులు ఉన్నత అధికారులు వీటిపై పర్యవేక్షించి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ వ్యవస్థకు దెబ్బ పడకుండా ఉండాలని చిన్న తరహా పెద్ద తరహా పరిశ్రమల మీద వారి పెత్తనం నుండి కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో నరసింహ యాదగిరి డాన్ శ్రీను తదితరులున్నారు.



జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని కోటి సంతకాల సేకరణ

నవతెలంగాణ-నాంపల్లి

బీసీ కుల గణన, 27 శాతం ఉన్న రిజర్వేషన్స్ 52 శాతనికి పెంచాలని బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నాంపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆందోజు శంకరాచారి హాజరై మాట్లాడారు. బీసీలకు అన్ని రంగాలలో అన్యాయం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల అభివృద్ధి సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీల కుల గనన చేపట్టి జనాభా ప్రకారం 52 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి మండల అధ్యక్షుడు పల్లేటి వినోద్ కుమార్, మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు గండు నాగేంద్రబాబు ,ఉపాధ్యక్షుడు బొట్ట శివ ,నాంపల్లి ఉపాధ్యక్షుడు జిల్లాగోని మహేష్, కడారి జంగయ్య యాదవ్, మహేష్, యాదవ్, పంబాల వంశీ, రామచంద్రి యాదవ్, సోషల్ మీడియా కన్వీనర్ పల్లెటి రమేష్, పూదరి నరసింహ, అందుగుల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

నవతెలంగాణ-హాలియా

ఉత్తమమైన సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయులే కీలక పాత్ర పోషిస్తారని అనుముల మండలం చింతగూడెం ప్రధానోపాధ్యాయులు ఏ.వేమారెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో జరిగిన స్వపరిపాలనా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వపరిపాలన దినోత్సవం విద్యార్థులలో బాధ్యతను ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులుగా సోనీ, భవాని, పూజిత, రాధిక, నందిని, శివాని, శివ సతీష్ మహేష్ తదితరులు వ్యవహరించారు. పాఠశాలను చక్కగా నిర్వహించిన విద్యార్థులను ఉపాధ్యాయులు గడ్డం శ్యాంప్రసాద్, ఎండీ.పాష, పురం వెంకటయ్య, పేర్ల వెంకటేశ్వర్లు, దూసరి మధు, ఈగల లింగయ్య శ్రీనివాస్ సుజాత తదితరులు అభినందించారు.



పేద ప్రజల అండగా పిల్లి రామరాజు యాదవ్

నల్లగొండ:నల్లగొండ నియోజకవర్గంలో వివిధ కారణాల రీత్యా చనిపోయిన కుటుంబాలకి ఆర్థిక భరోసా ఇస్తూ అండగా ఉంటున్నాడు. బీఆర్ఎస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ ఆర్కే ఎస్ ఫౌండేషన్ చైర్మన్ 8 వార్డ్ కౌన్సిలర్ పిల్లి రామరాజు యాదవ్ శనివారం నల్గొండ మున్సిపాలిటీ 04 వార్డ్ రాం నగర్ కి చెందిన వింజమూరి ముత్తమ్మ గారి కుటుంబానికి 10,000,నల్గొండ మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన బక్కతల రాములమ్మ కుటుంబానికి 10000, రెండు కుటుంబాల కలిపి 20000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాషాయ్య ,మెరుగు శ్రీకాంత్ ,గణేష్, కార్తీక్, మారయ్య, మంగయ్య, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-నల్లగొండ రూరల్



నల్గొండ పట్టణంలోని వీటి కాలనీ నందు గల హిమాలయ ఓల్డ్ ఏజ్ హోంలో ఉన్న వృద్ధులకి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ దుప్పట్లను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మెన్ గోలి అమరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు ఊరుకొండ ప్రభాకర్‌రెడ్డి , సూరెడ్డి సరస్వతి, రిటైర్డ్ ప్రిన్సిపల్ జెఆర్సి కోఆర్డినేటర్ మందడి నర్సిరెడ్డి, కోశాధికారి మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కుసుకుంట్ల ముత్యంరెడ్డి, రెడ్‌క్రాస్ సిబ్బంది సద్దాం హుస్సేన్ యూత్ వాలంటీర్స్ అంజయ్య, శ్రీనివాస్ ఓల్డ్ ఏజ్ హోమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల ఏడు నుంచి సుంకిశాల ముత్యాలమ్మ జాతర



- తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు రాక
- మండలంలో అత్యంత వైభవంగా జరిగే అతిపెద్ద జాతర

నవతెలంగాణ-పెద్దవూర

నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గం పెద్దవూర మండలంలో ఈ నెల ఏడవ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే సుంకిశాల ముత్యాలమ్మ జాతర అత్యంత వైభవంగా జరుగనుంది. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. సుంకేశాల ముత్యాలమ్మ జాతర భక్తులకు కోరిన కోర్కెలు తీర్చే గ్రామ దేవతగా, భక్తుల పాలిట కొంగు బంగారంగా నిలిచే తల్లిలా నిలుస్తుందని గిరిజనుల నమ్మకం. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆనకట్ట ఏర్పాటు చేసేటప్పుడు సుంకిశాల గ్రామం ముంపునకు గురైంది. అసమయంలో అక్కడ వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆసమయంలో అక్కడ వెలసిన ముత్యాలమ్మను పెద్దవూర మండలం పర్వేదుల గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో నిలిపారు. కానీ అక్కడ అనుకూల పరిస్థితులు లేకపోవడంతో తిరిగి ఉమ్మడి తుంగతుర్తి పంచాయతీలోని రామన్నగూడెం తండా స్టేజి వద్ద నాగార్జునసాగర్ హైదరాబాద్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేశారు. ఇక్కడ 40 ఏళ్లుగా ప్రతి రెండేళ్లకు ఒకసారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా జాతర కొనసాగుతొంది.

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా రానున్న భక్తులు

సుంకిశాల ముత్యాలమ్మ జాతరకు ఆంధ్ర తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా రానున్నారు జాతరలో ప్రభల అందాలు జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలువ నున్నాయి జాతరకు నియోజకవర్గం నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. మూడురోజులు జరగబోయే ఈ జాతరలో వేలాదిగా భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. జాతరను అంగరంగవైభవంగా ముత్యాలమ్మ అమ్మ వారి జాతరను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ పూజారి మోహన్ నాయక్ తెలిపారు. ఇందులో భాగంగా ఆలయానికి రంగులు, నూతనంగా షెడ్ నిర్మాణం, మహిళలకు స్నానపు గదులు ఏర్పాట్లు చేస్తున్నారు.



జాతరకు అందాన్నిచ్చే ప్రభలు

సుంకిశాల ముత్యాలమ్మ జాతరలో ప్రభలు భక్తులకు కనువిందు చేస్తాయి. ప్రతి గిరిజనులు ఇంటింటికి అందంగా అలంకరించిన ప్రభలు ఏర్పాటు చేసుకొని అమ్మవారి ఆలయం ముందు ఉంచుతారు. ఆప్రాంత ప్రభలతో భక్తులకు స్వాగతం పలుకుతాయి. ఈ జాతర అన్ని వర్గాల ప్రజలు రాజకీయ నాయకులతో, అధికారులతో కన్నుల పండగగా వేడుకలు జరుపుకుంటారు.

మగ్దూం మొయినుద్దీన్ స్ఫూర్తితో ఉద్యమించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

నవతెలంగాణ-నల్లగొండ



తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ప్రముఖ కవి రచయిత మగ్దూం మొయినుద్దీన్ స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. శనివారం సత్యం మగ్దూం 115వ జయంతి సందర్భంగా పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ శ్రావణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి గాదపాక రమేష్, ఏఐటీసీ నాయకుడు కేఎస్ రెడ్డి, ముండ్ల ముత్యాలు, పాండరి కృష్ణయ్య, అంకులయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు భృతి చెల్లించాలి

- యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జేసీకీ వినతి



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

తెలంగాణ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజా రమేష్ డిమాండ్ చేశారు. అసెంబ్లీలో రేపు ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించాలని యువజన కాంగ్రెస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జాయింట్ కలెక్టర్ భాస్కర్ రావును కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. 2018 ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగ యువకులకు నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి నేటి వరకు అమలు పరచడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కొర్ర రామ్ సింగ్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నరేష్, ఓబీసీ జనరల్ సెక్రటరీ పతనబోయిన సంతోష్, నాగార్జున సాగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పగడాల నాగరాజు, నల్గొండ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నవీన్ గౌడ్, గుర్రంపోడ్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కమతం జగదీశ్ రెడ్డి,నల్గొండ యువజన కాంగ్రెస్ కార్యదర్శి తబ్రేజ్ ఖాద్రి,యువజన కాంగ్రెస్ నాయకులు బాణాల సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రజకుల అభివృద్ధికి ప్రభుత్వం విధులు కేటాయించాలి

నవతెలంగాణ-బొమ్మలరామరం

గ్రామీణ ప్రాంతాల కులవృత్తికి నమ్ముకుని జీవనం సాగిస్తున్న రజక కుటుంబాలు అద్వాన స్థితిలో ఉన్నాయని రజక కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం తక్షణమే రజక సంఘాలకు నిధులు కేటాయించాలని రజక సంఘం అధ్యక్షులు తూముకుంట గణేష్ కోరారు.శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆర్థికంగా రాజకీయంగా రజకులు వెనుకబడి ఉన్నారని.సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వడ్లకొండ రమేష్, ప్రధాన కార్యదర్శి అనిల్, కార్యదర్శి సాయి, కోశాధికారి భాస్కర్, నాగులు, కేశనాగులు, వినోద్, మురళి, శేకర్, సంజ్, ఈశ్వర్, వినయ్, ఉపేందర్, మహేష్, శ్రీకాంత్, నాగులు, రజక సంఘ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

నవతెలంగాణ-మాడుగులపల్లి

మండలంలోని చిరుమర్తి గ్రామంలో శనివారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశం చిరుమర్తి శక్తి కేంద్రంలో నిర్వహించారు. మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీనివాసరావు, పాలక్ సినీ యాక్టర్ కవిత, అసెంబ్లీ కన్వీనర్ రతన్ సింగ్ నాయక్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మ కంటి నరసింహ, మండల ఇన్చార్జ్ సురేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



ఘనంగా డాక్టర్ నాగం జన్మదిన వేడుకలు

- పట్టణంలో కార్యకర్తల భారీ ర్యాలీ

నల్లగొండ:బీజేపీ రాష్ట్ర యువ నాయకులు నాగం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మెన్ నాగం వర్షిత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం నల్లగొండ పట్టణంలో పార్టీ నాయకులు కార్యకర్తల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు దేవరకొండ రోడ్డు వైఎస్ఆర్ విగ్రహం నుండి భాస్కర్ టాకీస్, ఆర్పీ రోడ్, గడియారం సెంటర్, హైదరాబాద్ రోడ్ వివేకానంద విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిన్న వెంక రెడ్డి ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన పుట్టినరోజు వేడుకల్లో అభిమానుల మధ్య భారీ కేకును కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. అనంతరం నాయకులు కార్యకర్తలు పూలమాలలు శాలువాలతో నాగం వర్షిత్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరికలు

నకిరేకల్:నకిరేకల్ నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శనివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కట్టంగూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య ఆధ్వర్యంలో టిపిసిసి ప్రతినిధి సుంకర బోయిన నరసింహ యాదవ్ అధ్యక్షతన సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పిఎసిఎస్ మాజీ చైర్మెన్ చౌగోని సాయిలు, ప్రమీల ముత్యాలమ్మ గూడెం మాజీ సర్పంచ్ ఎండి అన్వర్ బాషా, ఎంపీటీసీ సుంకే సంజీవరెడ్డి తోపాటు పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టంపల్లి మాజీ సర్పంచ్ గౌర నరసింహ, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు ముక్కామల శేఖర్, మేడి విజయ్, నర్సింగ్ సంతోష్, పల్నాటి వెంకట్ రెడ్డి, అరుణ్, సిహెచ్ రాజు, నగేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-మోత్కూర్

మున్సిపల్ కేంద్రంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన మందుల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబానికి శనివారం మోత్కూర్ మార్కెట్ మాజీ చైర్మెన్చిప్పలపల్లి మహేంద్రనాథ్, బీఆర్ఎస్ యువజన జిల్లా నాయకుడు కూరెళ్ల పరమేష్ 50 కిలోల చొప్పున క్వింటా బియ్యం, 12వ వార్డు ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము సైదులు రూ.వెయ్యి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నకిరేకంటి శ్రీను, బాలెంల మధు, మున్సిపాలిటీ యూత్ వైస్ ప్రెసిడెంట్ కూరెళ్ల ఇంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ కూరెళ్ల రమేష్, కూరెళ్ల సైదులు, బోడ బాబురావు, కూరెళ్ళ నాగరాజు, కూరెళ్ల నరేష్, కూరెళ్ల ప్రభు, మెంట రాజు, కూరెళ్ల సుధాకర్, కూరెళ్ల సైదులు, చెడిపల్లి యాదగిరి, రుద్రపల్లి గణేష్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండలం గోపాల్ పూర్ గ్రామానికి చెందిన గౌడెల్లి చంద్రకళ, చిక్కుడు తులసమ్మ ,ఉద్యమరి రాములమ్మ లు అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబాలకు ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బిజెపి రాష్ట్ర నాయకుడు పడాల శ్రీనివాస్ ఒక్కొక్క కుటుంబానికి 5తుర్కపల్లి000 రూపాయల ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేసి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూలపల్లి రాధాకృష్ణ ,నారం పెద్దలు, తలారి ఆంజనేయులు, భీమరి కుమార్ ,కూర కనకయ్య, ఉద్యమరి గణేష్, మెరుగు కృష్ణ ,మెరుగు ఆంజనేయులు ,అత్తి హనుమంతు, ఉడత ముత్యాలు, చిన్రాజు ఓజి తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన చేనేత కార్మికురాలు లక్ష్మమ్మ అకాల మరణం మృతి చెందింది ఆమె కుటుంబానికి శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ వలిగొండ కమిటీ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి రూ 10,000 అంత్యక్రియల కోసం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు ఐటి పాముల రవీంద్ర జనరల్ సెక్రెటరీ పడమటి మురళీధర్ రెడ్డి కోశాధికారి కీసరి దేవయ్య ఉపాధ్యక్షులు రాపోలు శ్రీనివాస్ డైరెక్టర్ గొలుసుల నరసింహ గులాబ్ జిలాని దేవనక అంజయ్య కీర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు .

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నవతెలంగాణ- ఆలేరుటౌన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి,సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం దొంతిరి సోమిరెడ్డి గార్డెన్ ఆవరణలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు పివి శ్యాంసుందర్రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి వెళ్లాలన్నారు. అనంతరం భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ , మునగోడు మాజీ శాసనసభ సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , జోనల్ ఇంచార్జ్ బంగారి శృతి , రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు గార్ల తో కలిసి పాల్గొన్న బి.జె.పి రాష్ట్ర నాయకులు సుదగాని హరిశంకర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేషం, పాశం భాస్కర్ , పోతంశెట్టి రవీందర్ , ఖమ్మం జిల్లా ఇన్చార్జి కడగంచి రమేష్ , రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణ రెడ్డి , పడాల శ్రీనివాస్ , వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్ , పడమటి జగన్ మోహన్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.



జనార్దన్ రెడ్డికి నివాళులర్పించిన గొంగిడి మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ -రాజాపేట

మండలంలోని రేణిగుంట గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సర్పంచ్ పిఎస్ఎస్ చైర్మెన్ చింతలపూడి భాస్కర్ రెడ్డి తండ్రి చింతల పూరి జనార్దన్ రెడ్డి శనివారం మృతిచెందాడు. ఆయన పార్థివ దేహానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మెన్, తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరారు . ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరి గౌడ్, రాజపేట బి ఆర్ఎస్ మండలం మండల పార్టీ అధ్యక్షులు నా గీ ర్తి రాజిరెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కాకల్ల ఉపేందర్, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

'కలానికి..సంకెళ్లు..!

- జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులు
- వార్తలు రాస్తే బెదిరిస్తున్న నాయకులు, అధికారులు
- పత్రిక స్వేచ్ఛకు భంగం, ప్రజాస్వామ్యానికి తూట్లు



నవతెలంగాణ-మిర్యాలగూడ

పాలకుల దౌర్జన్యాలకు ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికా స్వేచ్ఛకు భంగం కలుగుతుంది. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టులపై దాడులు చేస్తూ, అక్రమ కేసులు బనాయిస్తున్నారు. వ్యతిరేకంగా వార్తలు రాస్తే నాయకులు, అధికారులు, బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో నిజాన్ని నిర్భయంగా పత్రికలో రాసే పరిస్థితి కనుమరుగవుతుంది. అధికార పార్టీ నాయకులు, అధికారుల తీరుతో కలానికి సంకెళ్లు పడుతుంది. దేశవ్యాప్తంగా మీడియా స్వేచ్ఛను గొంతు నొక్కి పరిస్థితి ఏర్పడింది. ఇదే తరహాలో తెలంగాణలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో నవ తెలంగాణ విలేకరిపై జరిగిన దాడి, అక్రమ కేసులో ఉదాహరణ. పాలకులు, అధికారుల ఆగడాలను అడ్డుకోకపోతే భవిష్యత్తులో పత్రిక స్వేచ్ఛకు మునిగి లేకుండా పోయే ప్రమాదం ఉంది.

జర్నలిస్టుపై దాడులు, అక్రమ కేసులు

నిజాన్ని నిర్భయంగా వాస్తవాలను వెలుగులకు తీస్తున్న జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లాలో మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న నవతెలంగాణ విలేకరి అనిశెట్టి యాదగిరి పై ఒకటి మున్సిపల్ చైర్ పర్సన్ భర్త అతని అనుచరులు దాడులకు పాల్పడి పైగా అక్రమ కేసులు బనాయించారు. మున్సిపాలిటీలో కౌన్సిలర్ల అసంతృప్తి దృష్టికి రాగా మున్సిపల్ చైర్ పర్సన్ వర్సెస్ కౌన్సిలర్ అనే శీర్షికతో కథనం రాసినందుకు మున్సిపల్ చైర్ పర్సన్ భర్త మేఘారెడ్డి అతని అనుచరులు నలుగురు యాదగిరి ఇంటిపై దాడి చేసి యాదగిరి అతని భార్య, తల్లిని గాయపరిచారు. ఈ విషయంపై యాదగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకుండా ఎస్సై నిందితులకు అండగా నిలిచి రాజీ కోసం యాదగిరి పై ఒత్తిడి తీసుకువచ్చారు. ఒప్పుకోకపోతే ఈ యాదిగిరి చేత మరో పిటిషన్ తీసుకొని ఆ నలుగురిపై కేసు నమోదు చేస్తూనే, యాదగిరి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ అక్రమ కేసు నమోదు చేశారు. ఇటీవల దామరచర్ల మండలంలో భూముల కబ్జాపై అధికారి విచారణ రాగా అట్టి విషయాన్ని వార్త రాయగా ఆ వార్త విలేకరిపై బెదిరింపులకు పాల్పడ్డారు. ఒక దశలో ఇంటికి వెళ్లి దాడులు చేసేందుకు ప్రయత్నించారు. గతంలో ఆ విలేకరితోపాటు విలేకరు మరి కొంతమంది విలేకరులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారు. గతంలో మిర్యాలగూడ డివిజన్లోని ఓ పోలీస్ స్టేషన్ లో జరుగుతున్న అవినీతిని నవ తెలంగాణలో రాయగా ఆ విలేకరిపై ఉన్నత పోలీసు అధికారి బెదిరింపులకు పాల్పడినారు. అక్రమ కేసులు బనాయిస్తామంటూ బెదిరింపులు చేశారు. అదేవిధంగా ప్రభుత్వం అందించిన ట్రాక్టర్ల పంపిణీలో అధికార పార్టీ నాయకులే తీసుకున్నారని వార్త రాసినందుకు ఆ పార్టీ నాయకుల నుండి ఆ విలేకరికి బెదిరింపులు వచ్చాయి. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న భూకబ్జాలపై వార్తను రాస్తే అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఆ విలేకరిని 'నీ' అంతు చూస్తామంటూ బెదిరించిన సంఘటనలు కూడా ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో భూకబ్జాలపై ఓ విలేకరి వార్త రాస్తే ఆ విలేకరి పై అక్రమ కేసులు బనాయించి 14 రోజుల పాటు జైల్లో ఉంచారు. ఈ జిల్లాతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాలో కూడా పలు పత్రిక విలేకరులపై వార్తలు రాసినందుకు బెదిరింపులు వచ్చాయి. కొంతమంది విలేకరులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారు.

జీర్ణించుకోలేకపోతున్న నాయకులు, అధికారులు

ఉమ్మడి జిల్లాలో భూకబ్జాలు అక్రమ దందాలు జోరుగా సాగుతున్నాయి. నాయకుల మధ్య పెరుగుతున్న వైరుధ్యాలు, పాలకుల మధ్య విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి సొంత ప్రయోజనాలకు పాకులాడుతున్నారు. వీరికి అధికారులు పోలీసులు అందదండలు అందించడంతో వారి ఆగడాలకు అంతులేకుండా పోతున్నాయి. ఇలాంటి విషయాలను ప్రజలకు తెలిపేందుకు పత్రికల్లో వార్తలు రాస్తే జీర్ణించుకోలేని అధికారులు నాయకులు దాడులకు పాల్పడుతున్నారు. ముందుగా బెదిరింపులకు దిగుతూ ఆపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ దాడుల పట్ల ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోకుండా అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారు. పైగా వారి ఒత్తిడి మేరకు అక్రమ కేసులు బనాయిస్తూ విలేకరుల చేతులకు సంకెళ్ల వేస్తున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్న ప్రశ్నించేవారు కరవై పోతున్నారు. దీంతో పత్రిక స్వేచ్ఛకు భంగం కలిగి ప్రజాస్వామ్యానికి తూట్లు పడుతున్నాయి. భవిష్యత్తులో మీడియా స్వేచ్ఛ కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది.

జర్నలిస్టులు ఐక్యంగా ఉద్యమించాలి

ఎలాంటి జీతభత్యాలు లేకున్నా ప్రజాసేవ కోసం మీడియా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టుల పట్ల దాడులు, అక్రమ కేసులు అడ్డుకునేందుకు జర్నలిస్టులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉంది. సంఘాలకు, పత్రికలకు అతీతంగా జర్నలిస్టులందరూ ఒక తాటి పైకి వచ్చి బలమైన ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉంది. ఒక జర్నలిస్టుకు అన్యాయం జరిగితే వందలాది జర్నలిస్టులు రోడ్లపైకి వస్తారనే సంకేతాన్ని ప్రజలోకి తీసుకెళ్లినప్పుడే జర్నలిస్టులకు రక్షణ అందుతుంది. సమాజంలో జరుగుతున్న అన్యాలను, పాలకుల, అధికారుల అవినీతిని ఎప్పటికప్పుడు వెలుగులోకి తెచ్చి ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉంది. బెదిరింపులకు భయపడకుండా వాస్తవాలను వెలుగులోకి తేవాలి. అప్పుడే పత్రిక స్వేచ్ఛకు రక్షణ దొరుకుతుంది. జర్నలిస్ట్ పై జరుగుతున్న దాడులు అక్రమ కేసులు అడ్డుకునేందుకు జర్నలిస్టులందరూ ఉద్యమించాల్సిన అవసరం ఉన్నది.

అంబులెన్స్‌కోసం ఆర్థిక సాయం

నవతెలంగాణ -బొమ్మలరామరం

అత్యవసర పరిస్థితిలలో మండల ప్రజలకు కల్పించిన అంబులెన్స్ సేవలకు ఆర్థిక సహాయం 10000 రూపాయలు శనివారం రోజున సోలిపేట గ్రామ సర్పంచ్ పూడూరి నవీన్ గౌడ్ అందజేశారు. అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, 24 గంటలు మండల ప్రజలకు ముఖ్యంగా గిరిజన తండావాసులకు అత్యవసర వేళల్లో తక్షణమే పెరుగైన వైద్యం కోసం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి హైదరాబాద్ గాను చుట్టుపక్కల వెళ్లడం కోసం అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి,ఎంపీడీవో సరిత, నాగినేనిపల్లి సర్పంచ్ బీరప్ప , జూపల్లి భరత్ ఉపసర్పంచ్ తదితరులు నాయకులు పాల్గొన్నారు

"అక్రమ ఇసుక రవాణాపై ఫిర్యాదు చేస్తా'

నవతెలంగాణ-అడ్డగూడూరు

మండలంలోని చిర్రగూడూర్ కోటమర్తి గ్రామాల మధ్యన బిక్కేరువాగులో అక్రమ ఇసుక రవాణాపై ముఖ్యమంత్రి కేసీఆర్ కు పిర్యాదు చేయనున్నట్లు రాష్ట్ర గిడ్డంగుల మాజీ చైర్మెన్ మందుల సామేలు అన్నారు. శనివారం ఆయన కోటమర్తి గ్రామంలో గ్రామపంచాయతీ వద్ద రైతులతో కలసి మాట్లాడారు. బిక్కేరువాగులో ఇసుక అనుమతులు రద్దుచేసేందుకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోటమర్తి గ్రామ సర్పంచ్ చిప్పలపల్లి బాలు ,కోటమర్తి చిర్రగూడూర్ గ్రామాల రైతులు పాశం సత్యనారాయణ, చిత్తలూరి సోమనారాయణ, వార్డు సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చిన వారికే ఇండ్లస్థలాలు చూపించాలి

నవతెలంగాణ - భువనగిరి

హుస్నాబాద్ గ్రామ పరిధిలోని 107 సర్వే నెంబర్ గతంలో ఇండ్ల స్థలాలను ప్రభుత్వం థర్డ్ పెస్ వారికి పట్టాలు ఇచ్చిన వారికే తిరిగి స్థలాలు కేటాయించాలని కొరుతూ బీఆర్ఎస్ నాయకులు కొలుపుల కమలాకర్ శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ థర్డ్ ఫేస్ వారికి ఇచ్చేసరికి రైతులు తమ భూమి అని కోర్టులో కేసు వేసినారని తెలిపారు. ఇప్పుడు బస్వాపురం ప్రాజెక్టులో ఇండ్లు కోల్పోయిన వారికి ఈ స్థలాన్ని ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో నిరుపేదలైన లబ్దిదారులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో చింతకాయల ఉపేందర్, సిద్దంకి కొటయ్య,ఆకుల యాదగరి, కమ్మ వేంకటేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పైళ్ల అష్టోత్తర శతఘట్టాభిషేకం

నవతెలంగాణ - భువనగిరి

మున్సిపల్ పట్టణ కేంద్రంలోని 17వ వార్డు లోని శ్రీ గోవిందా క్షేత్రంలో ఏర్పాటు చేసిన శ్రీ అభయాంజనేయ స్వామి వారికి శనివారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మూల విరాట్ శ్రీ అభయాంజనేయ స్వామికీ అష్టోత్తర శతఘట్టాభిషేకం చేసి 108 కలశములతో శ్రీ ఆంజనేయస్వామి వారికి వేద పండితుల ద్వారా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ నాయిని కృష్ణ వైస్ చైర్మన్ సరగడ వెంకటేశ్వర్లు పసుపు నూరి నాగభూషణం పొద్దుటూరి నాగేందర్ ఆలయ ప్రధాన అర్చకులు నరేష్ చారి వేణు పంతులు జగన్ స్థానిక కౌన్సిలర్ చెన్న స్వాతి మహేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేందర్ రెడ్డి, ఏవి కిరణ్ కుమార్, గాదె శ్రీనివాస్, మున్సిపల్ చైర్మెన్ ఆంజనేయులు వైస్ చైర్మెన్ చింతల కిష్టయ్య కడారి వినోద్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

నవతెలంగాణ-మోత్కూర్

అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తున్నట్లే భాషా పండితులు, పీఈటీలకు ప్రమోషన్లు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా ప్రధానకార్యదర్శి కందిగట్ల శ్రీనివాస్ కోరారు. భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని శనివారం మోత్కూర్, ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూర్ మండలాల ఉపాధ్యాయులు మోత్కూర్ లో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు కేసులను సాకు చూపి పదోన్నతులు ఆపడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రప్ట్ రాష్ట్ర కార్యదర్శులు గుమిడెల్లి వెంకన్న, దర్శనం వెంకన్న, ఐఖ్యవేదిక బాధ్యులు తొర్ర ఉప్పలయ్య, నిజాం, మర్రి జయశ్రీ, ఫరూక్, మత్స్యగిరి, శ్రీధర్, సైదులు, రాజేశ్వరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడుఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-మోత్కూర్

తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ ఆదివారం మోత్కూర్ మండలంలో పర్యటించనున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దత్తప్పగూడెం గ్రామంలో సీసీ రోడ్లు శంకుస్థాపన, ప్రారంభోత్సవంలో పాల్గొంటారన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



1.04 లక్షల మందికి కంటిపరీక్షలు

- డీఎంహెచ్ఓ డాక్టర్ కొండల్‌రావు
- జిల్లా వ్యాప్తంగా 74 ఉచిత కంటి పరీక్ష శిబిరాలు

నవతెలంగాణ-మిర్యాలగూడ

జనవరి 19 నుంచి అన్ని ప్రాంతాలలో ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు కంటి సమస్యలు ఉన్నా వారికి కంటి పరీక్ష శిబిరంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లద్దాలు, అవసరం ఉన్నవారికి ఆపరేషన్లు సైతం చేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్నిమల్ల కొండల్‌రావు అన్నారు. శనివారం డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం జూన్ 30 వరకు నల్లగొండ జిల్లాలోని అన్ని ప్రాంతాలలో పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 18 లక్షల 12,626 మంది ప్రజలకు కంటి పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి కంటి శిబిరంలో ఒక మెడికల్ ఆఫీసర్‌తో పాటు 6 నుంచి 8 మంది మెడికల్ సిబ్బంది విధులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 844 గ్రామపంచాయతీలలో182 మున్సిపల్ వార్డులలో కంటి శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఫిబ్రవరి మూడు వరకు జిల్లా వ్యాప్తంగా 1,04,264 మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని, 17,954 మందికి రీడింగ్ గ్లాసులను అందజేయడం జరిగిందన్నారు. 11,579 దూర చూపు కలిగినవారికి కంటి అద్దాలను త్వరలోనే అందజేయనున్నట్లు తెలిపారు. అవసరం ఉన్నవారికి కంటి ఆపరేషన్లు సైతం చేయించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఉచిత కంటిపరీక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కేస రవి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్లు ఎస్.గీతావాణి, కే.జయ, డీఎంఓ రవిశంకర్, సీహెచ్ఓ శ్రీనివాస్ స్వామి, వెంకయ్య, ఎస్వోఓ. వాసు దేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1 లక్ష 48 వేల మందికి బీపీ, షుగర్ గల వారికి ఎన్సీడీ మందుల కిట్ పంపిణీ
విలేకరుల సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కొండల్‌రావు

ఉన్నతమైన జీవనానికై ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని నల్గొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్నిమల్ల కొండల్ రావు పేర్కొన్నారు. శనివారం మిర్యాలగూడ డిప్యూటీ డీఎంహెచ్వో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రక్తపోటు, చక్కెర వ్యాధి గలవారికి త్వరలోనే వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఎన్సీడీ మందుల కిట్‌ను, అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. నల్గొండ జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్సీ పరిధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి రక్తపోటు చక్కెర వ్యాధి గల వారి వివరాలను సర్వే నిర్వహించి సేకరిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 1 లక్ష 48 వేల మంది మందికి ఎన్సీడీ మందుల కిట్‌లను అందజేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ డిప్యూటీ డీఎంహెచ్ ఓ డాక్టర్ కేస.రవి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్లు. ఎస్ గీతావాణి, కే.జయ, డీఎంఓ. రవిశంకర్, సీహెచ్ఓ. శ్రీనివాస్ స్వామి, వెంకయ్య, ఎస్వోఓ. వాసు దేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ జాబితా విడుదల

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

ఎస్సీ స్టడీ సర్కిల్ లో వివిధ కోర్సుల ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న 285 మంది అభ్యర్థుల నుండి అర్హత గల 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్టు ఎస్సి స్టడీ సర్కిల్ డైరెక్టర్ పడిదాల నవీన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితాను tsstudycircle. co. in లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు నేడు ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఎస్సి స్టడీ సర్కిల్ నల్లగొండ నందు నిర్వహించే సర్టిఫికెట్ వెరిఫికేషన్లకు హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు 8465035932,9603167257 ను సంప్రదించాలని పేర్కొన్నారు.



ఈనెల 28 లోగా సీఎంఆర్‌ను పూర్తిగా అందివ్వాలి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

నల్లగొండ జిల్లాలోని 2021 - 22 సంవత్సరం రబి సీజన్‌కు సంబంధించి రైస్ మిల్లర్లు ఈనెల 28వ తేదీలోగా సిఎంఆర్ (కష్టమెల్లింగ్ రైస్) ను ఎఫ్సీఐకి పూర్తిగా అందివ్వాలని డీఎస్ఓ వెంకటేశ్వర్లు రైస్ మిల్లర్లకు సూచించారు.శనివారం నల్లగొండ పట్టణంలోని గౌతమి రైస్ మిల్లు ను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 327653.560 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లులకు అందివ్వగా 218341 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉందన్నారు. రైస్ మిల్లర్లు నేటికీ 160660 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఎఫ్సీఐకి అందించారని మిగతా బియ్యాన్ని ఈనెల 28లోగా ఎఫ్సీఐకి అందివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై సిబ్బంది లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు అధికారులకు పట్టవా..

- పొలాల నుండి కంపెనీకి వెళ్లే దారి లేదంటూ ఆందోళన

నవతెలంగాణ-చింతపల్లి

చింతపల్లి మండలంలోని పోలేపల్లి గ్రామ రెవెన్యూ సర్వేనెంబర్ 240 మరియు 224 మధ్య భూముల నందు రైతులు పలకంటి నారయ్య,పడకంటి కృష్ణయ్య, పలకంటి బక్కయ్య,పలకంటి వీరమ్మ,పడకంటి కృష్ణయ్య, పడకంటి యాదయ్య మొదలైన రైతుల భూముల నుండి అక్రమంగా కంపెనీ బండ్లు వెళ్లడం చాలా బాధాకరమని వృద్ధ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల పట్టా భూముల నుండి ఐ.ఎమ్.ఆర్ కంపెనీకి అక్రమ దారికి తాసిల్దార్ , మండల ఆర్.ఐ సర్వేర్లు, కంపెనీకి అనుకూలంగా సర్వే రిపోర్ట్ (పంచనామా) వారి దారికి అనుమతి ఇచ్చినట్లు కంపెనీ యాజమాన్యం చెబుతున్నారని, అట్టి పంచనామా ను అడ్డుపెట్టుకొని రైతుల భూముల మధ్యన కంపెనీకి అక్రమంగా రోడ్డును వేస్తున్నారని రైతులు తెలియజేశారని, ఇదివరకే మండల తహసీల్దార్ సర్వే నివేదికలో నెంబర్ 240, 224 మధ్యన నక్ష ప్రకారం ఎలాంటి కాలిబాట గానీ,ఎడ్ల బండి బాట గానీ, ఎలాంటి రహదారి లేదని నివేదికను సమర్పించినారని, కంపెనీ యాజమాన్యానికి చట్ట విరుద్ధంగా మండల తహసీల్దార్, ఆర్.ఐ, సర్వేయర్లు కుమ్మకై కంపెనీ యాజమాన్యం చూపిన ప్రలోభాలకు లొంగి రైతుల భూములగుండా దారికి అనుమతులు ఇచ్చి, పోలీసుల చేత అక్రమ కేసులు పెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు. మూడు కంపెనీలు తయారు చేస్తున్నప్పటికీ పై అధికారులు చేతివాటం ఉండకుండా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నోసార్లు జిల్లా కలెక్టర్‌కు తమ సమస్యలు చెప్పినప్పటికీ, ఎన్నోసార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ తమ సమస్యలు నిమ్మకు నేరెత్తిగా ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధాప్యంలో తాము సావడానికైనా సిద్ధమని చనిపోతే మా శవాలయం నుంచి కంపెనీ బండ్లు వెళ్తాయని రోధన తెలుపుతున్నారు.

రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

ఉడుగుంట్ల రాములు(సీపీఐ(ఎం)మండల కార్యదర్శి)



చింతపల్లి మండలంలోని పోలేపల్లి రాంనగర్ గ్రామానికి చెందిన వృద్ధ రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. సమస్యలు పరిష్కరించకపోతే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి చేసి సమస్యలు పరిష్కరించుకుంటామన్నారు. ఇంకా సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టర్ ఆఫీసు ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే శక్తి సీపీఐ(ఎం).

గోపలాయపల్లిలో బ్రహ్మోత్సవ శోభ

- నేడు శ్రీవారీ జల వేణుగోపాలస్వామి రుక్మిణి సత్యభామ కళ్యాణం
- అన్ని ఏర్పాట్లు పూర్తి
- కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-నార్కట్ పల్లి

జాతీయ రహదారి 65 గోపాలపల్లి లోగల శ్రీవారీ జల వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవా శోభ ఉట్టిపడుతుంది. గోపలాయపల్లి గ్రామంలోని గుట్టపైన శ్రీ వారి జాల వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 1 నుంచి 10 వరకు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని, స్వామి వారి కళ్యాణ మండపాన్ని సర్వాంగ సుంద రంగా తీర్చిదిద్దారు. రంగులతో, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. నేడు శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి రుక్మిణి సత్యభామల కళ్యాణం. శ్రీవారిజాల వేణుగోపాల స్వామి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పౌర్ణమి నాడు శ్రీ వారి జాల వేణుగోపాలస్వామి సత్యభామ రుక్మిణి కల్యాణం అత్యంత వైభవంగా వేలాది మంది భక్తుల



మధ్య కోలాహలంగా జరగనుంది. కళ్యాణ మహోత్సవానికి తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు రావడం విశేషం.

హరిత వనంలో శ్రీవారిజాల వేణు గోపాలుడు

గోపులాయపల్లి గ్రామానికి ఆనుకొని ఉన్న గోవుఅకారం ఉన్న గుట్టపై శ్రీవారిజాల వేణుగోపాలుడు పచ్చని చెట్లతో హరితవంలో కొలువై ఉన్నారు. వేలాది పచ్చని చెట్ల మధ్య శ్రీవారి జాల వేణుగోపాలస్వామి ఆలయం నిర్మించబడింది పచ్చటి చెట్లు, విశాలమైన స్థలం, మధ్యలో గర్భాలయం ముందు భాగంలో కోనేరు, పక్కనే భారీ ఆంజనేయస్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్శణీయంగా కనిపిస్తుంది.

స్వామి వారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశాం

కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి(ఆలయ కమిటీ చైర్మెన్)

వార్షిక బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆదివారం ఉదయం 10.30కు స్వామి వారి



కల్యాణం, బుధవారం రాత్రి 7 గంటలకు రథోత్సవం నిర్వహిం చేందుకు సిద్ధమయ్యాం. కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.ఇక్కడకు వచ్చే భక్తులకు వసతి గదులుఅందుబాటులో ఉన్నాయి.

సహజత్వానికి దగ్గరగా జీవించడమే క్యాన్సర్‌కు అసలైన నివారణ మార్గం

- ఎంజీయూ ఉపకులపతి ఆచార్య గోపాల్‌రెడ్డి

నవ తెలంగాణ-నార్కట్‌పల్లి



మానవ మనుగడ జీవన విధానం సహజత్వానికి దగ్గరగా జీవించడం వే క్యాన్సర్ కు అసలైన నివారణ మార్గం అనిఎం జి యు ఉపకులపతి ఆచార్య గోపాల్ రెడ్డి. పేర్కొన్నారు శనివారం ఆ విశ్వ విద్యాలయంలో జాతీయ సేవా పథకం సైన్స్ కళాశాల మూడవ యూనిట్, సాయి నైసా హాస్పిటల్ నల్లగొండ వారి సహకారంతో క్యాన్సర్ పై అవగాహన , ఉచిత వైద్య శిబిరాన్ని ఉపకులపతి ఆచార్య గోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి, ఆహారము పర్యావరణము, క్యాన్సర్ కారకాలుగా పరిశోధనుడు తేటతల్లం చేశాయని తెలిపారు. క్యాన్సర్ ను త్వరితగతిన గుర్తింపు సరైన చికిత్స ద్వారా ప్రాణహానిని తగ్గించవచ్చునని పేర్కొన్నారు. సహజత్వానికి దగ్గరగా జీవించడం ఉత్తమ మార్గం అని ఆయన సూచించారు. జాతీయ సేవా పథకం ద్వారా ఇటువంటి మరిన్ని అవగాహన కార్యక్రమాలు జరగాలని ఆకాంక్షించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో హాస్టల్ వర్కర్స్ 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య తుమ్మ కృష్ణారావు, ఆచార్య అల్వాల రవి, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ మద్దిలేటి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రేమ్ సాగర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.ఎస్ అన్నపూర్ణ, సాయి నైసా హాస్పిటల్ ప్రతినిధి డాక్టర్ అనిల్ కుమార్, వారి సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య.

నవతెలంగాణ -రామన్నపేట



రామన్నపేట పట్టణ పరిధిలోని రామన్నపేట - చిట్యాల డబుల్ రోడ్డు విస్తరణకు రూ.8.50 కోట్లు మంజూరు అయినట్లు స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ. 8.50 కోట్లు మంజూరు చేస్తూ ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని నలంద జూనియర్ కాలేజి నుండి సిరిపురం రోడ్ వరకు, రామన్నపేట సుభాష్ సెంటర్ నుండి పటణంలోని గాంధీ విగ్రహం వరకు డబల్ రోడ్ గా విస్తరణ చేయడంతో పాటు డివైడర్ నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ విస్తరణతో రామన్నపేట పట్టణం రూపురేఖలు మారతాయని, రామన్నపేట పట్టణ ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందని ఆయన తెలిపారు. నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్ రెడ్డి లకు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.